ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 25 జూలై 2025 | 5





ఉప్పాడలో సముద్రంలో అలల కల్లోలం.. రాజమహేంద్రవరంలో వాన దృశ్యాలు

వానే వాన!

- అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాలు
- రెండు రోజుల్లో మరింతగా బలపడి తీవ్ర అల్పపీడనంగా మార్పు
- ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలతో గోదావరికి పెరగనున్న ఇన్‌ఫ్లో
- సముద్రం అల్లకల్లోలంతో కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులకు బ్రేక్
- ఆఫ్రికాకు వెళ్లాల్సిన ఆరు షిప్‌ల్లో నిలిచిన లోడింగ్
- ఉప్పాడతోపాటు కోనసీమలో తీరం వెంబడి ఎగసిపడుతున్న అలలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం రోజంతా ముసురేసింది. అక్కడక్కడ భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అయితే ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం బలపడి రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా మారనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్నట్టు వెల్లడించింది. మరోపక్క ఒడిషా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లోను భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గోదావరిలోకి ఇన్‌ఫ్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోపక్క అల్పపీడనం ప్రభావంతో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో తీరం అల్లకల్లోలంగా మారింది. ఉప్పాడ, అల్లవరం, అంతర్వేది వద్ద అలల ఉధృతి భారీగా పెరిగింది. రాకాసి అలలు అంతెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ వద్ద అయితే సముద్రం ముందుకు రావడంతో మత్స్యకార గ్రామాల్లోకి రెండో రోజు కూడా నీరు చేరింది. అయితే తీవ్ర అల్పపీడనంగా ముదిరితే కెరటాల తీవ్రత మరింత పెరగనుంది. మరోపక్క సముద్రంలోపల ఈదురు గాలులు అధికంగా ఉండడంతో కెరటాల ఉధృతి అధికంగా ఉంది. అటు కాకినాడలో రోజంతా వాన కురవడంతో పోర్టులో బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఆఫ్రికా దేశానికి బియ్యం ఎగుమతి చేయడానికి ఆరు నౌకలు కొన్ని రోజుల కిందట పోర్టుకు వచ్చాయి. అయితే అలల తీవ్రత, వర్షం కారణంగా బియ్యం లోడింగ్ ఆగిపోయింది. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇదిలాఉంటే అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. కాకినాడ జిల్లా రౌతులపూడిలో అత్యధికంగా 2.8సెంటీమీటర్లు, శంఖవరం 2, కాకినాడ రూరల్ 1.7, పెద్దాపురం 1.2 సెంటీమీటర్లు కురవగా, మిగిలిన అన్ని మండలాల్లో మి.మి.లో వర్షపాతం నమోదైంది. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 1.2 సెంటీమీటర్లు, రాజోలు 1.1, మండపేట 1.1, తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో 1.1 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురవగా, మిగిలిన అన్ని మండలాల్లో మి.మి. చొప్పున వర్షం కురిసింది. అటు ముసురు వాతావరణంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి చలివాతావరణం కొనసాగింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై24(ఆంధ్రజ్యోతి): వాతావరణశాఖ హెచ్చరికలు, అధిక వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆమె ఒక ప్రకటన జారీచేశారు. ఈనెల 28వ తేదీ వరకూ జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 25న ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. లోతట్టు ప్రాంతాలు, పాత భవనాలు, నదీ తీర ప్రాంతాల వద్ద నివసించే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం జిల్లాలో 114.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని చెప్పారు. కోరుకొండ మండలంలో అత్యధికంగా 18.4, నిడదవోలులో 18.2, తాళ్లపూడి 18, రాజానగరంలో 15.4, సీతానగరంలో 15, నల్లజర్లలో 10.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని ఆమె తెలిపారు.

మహిళల ఉచిత బస్సులకు తుది మెరుగులు



532 బస్సులు సిద్ధం

రాజమహేంద్రవరం డిపోలో బస్సులకు మరమ్మతులు

ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాల్సిందేనని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో.. బస్సులను సమకూర్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 532 బస్సులు నిర్దేశిత సమయాని కంటే ముందుగానే సిద్ధంచేసి ట్రయల్ రన్ వేయాలని ఆలోచన చేస్తున్నారు. తూర్పు గోదావరిలో 285 బస్సులు ఉండగా 165 పల్లె వెలుగు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 291కి 191, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 300కి 176 పల్లెవెలుగులు ఉన్నాయి. వీటిలో 532 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగులు మహిళలకు సేవలు అందించనున్నాయి.

- వచ్చే నెల 15 ముహూర్తం
- ఆయా డిపోల్లో చురుగ్గా పనులు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 532 బస్సులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. కుషన్ సీట్లు, హ్యాంగర్లు వంటివి ఏర్పాటుచేసి రంగులు వేస్తున్నారు. ప్రయాణం సౌకర్యవంతంగా ఉండే విధంగా బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు, కాకినాడ, తుని, ఏలేశ్వరం, అమలాపురం, రాజోలు, రామచంద్రాపురం, రావులపాలెం డిపోల్లోని మహిళల ప్రయాణం కోసం ఉద్దేశించిన బస్సులను పూర్తిగా పరీక్షించి ఆ మేరకు మరమ్మతులు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన తర్వాత బస్సుల సీటింగ్ కెపాసిటీకి మించి రద్దీగా ప్రయాణికులు ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి ఇబ్బందీ కలగకూడదని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. దీంతో బస్సు బయలుదేరిన తర్వాత బ్రేక్‌డౌన్, బస్సు సాంకేతిక లోపాలతో రద్దుకావడం, కిటికీలు తదితర శబ్దాలు రాకుండా ఉండడం, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇబ్బందులు రాకుండా ఉండడంతోపాటు సౌకర్యవంతంగా ప్రయాణం సాగడం కోసం అవసరమైన అన్ని మరమ్మతు పనులూ చేస్తున్నారు. కొన్ని డిపోలకు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులు కొత్తగా ఇచ్చారు. దీంతో బాగా పాతబడిన వాటి బాడీలను పల్లె వెలుగులతో మార్పు చేస్తున్నారు.



నవోదయానికి రాజకీయ గ్రహణం

- సారా వ్యక్తులను పట్టుకుంటే తీవ్ర ఒత్తిడి
- అయినా ఆగని అరెస్ట్‌లు... 68 మంది వరకూ జైలులో
- 750 వరకూ కేసులు నమోదు
- జిల్లాలో 230 గ్రామాల్లో నాటు సారా
- 136 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటన
- సెప్టెంబరు చివరికి సారా రహిత జిల్లాగా లక్ష్యం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సారా రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నవోదయం-2కు జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు అడ్డుపడుతుండడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వం సెప్టెంబరు నెల చివరికి మొత్తం రాష్ట్రంతోపాటు జిల్లాను కూడా సారా రహిత జిల్లాగా ప్రకటించాలనే లక్ష్యంతో నవోదయం-2ను అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో ఎక్కడా సారా తయారుచేయడం, అమ్మడం, రవాణా చేయడం, తాగడం వంటివి ఏమీ ఉండకూడదు. ఈనేపథ్యంలో చాలాకాలం నుంచి ఇదే జీవనాధారంగా కొందరు బతకడాన్ని గుర్తించిన ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కూడా చూపించనుండడం తెలిసిందే. ఈ పథకాన్ని అమలుచేయడం కోసం ఎక్సైజ్‌తోపాటు స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూడా ఇక్కడ పని చేస్తున్నారు. జిల్లాలో 230 గ్రామాల్లో సారా తయారీ, రవాణా, అమ్మడం, తాగడం వంటి కార్యకలాపాలను గుర్తించి, అక్కడ విస్తృతంగా ప్రచారం మొదలుపెట్టారు. ఇప్పటికే 136 గ్రామాల్లో పూర్తిగా అరికట్టినట్టు అధికారులు చెబుతున్నారు. మిగతా గ్రామాల్లో ఆగస్టు నెలాఖరుకి పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తే సెప్టెంబరులో మొత్తం రాష్ట్రాన్ని సారా రహిత రాష్ట్రంగా ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికార్ల మీద తీవ్ర ఒత్తిడి ఉంది. ఎవరినీ వదలవద్దని, ముందు వార్నింగ్ ఇవ్వాలని, అవగాహన చేయాలని, వినకపోతే అరెస్టులు, రిమాండ్‌లు తప్పవని కూడా ఉన్నతాధికార్ల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. దీంతో జిల్లాలో అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోనూ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటివరకూ జిల్లావ్యాప్తంగా 750కు పైగా కేసులు నమోదు చేసి 68 మందిని రిమాండ్‌తో సెంట్రల్ జైలుకు పంపారు. రెండు మూడు రోజుల్లోనే 28 మందిని సెంట్రల్ జైలుకు పంపడం గమనార్హం. ఇప్పటికే ఒక మహిళపై పీడీ యాక్ట్ పెట్టారు. మరో ఇద్దరిపై ప్రతిపాదనలు చేశారు. అవి అధికార్ల పరిశీలనలో ఉన్నాయి.

● రాజకీయ ఒత్తిళ్లు..

ముఖ్యమైన సారా తయారీదార్లపై కేసులు పెట్టినా, అరెస్ట్ చేసినా రాజకీయ నేతల నుంచి అధికార్లకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఈసారికి వదిలేయమని చెబుతుండడం గమనార్హం. ఇటీవల ఒక గ్రామానికి చెందిన సారా వ్యాపారిని రెండుసార్లు అరెస్ట్ చేస్తే, తనకు కిడ్నీ ప్రాబ్లెమ్ ఉందని, బెయిల్ ఇస్తే ఇక మానేస్తానని చెప్పడంతో బెయిల్ ఇచ్చారు. కానీ అతను మళ్లీ మొదలు పెట్టడంతో ఇటీవల అరెస్ట్ చేశారు. అతనిని వదిలేయమని స్వయంగా ఓ నేత ఫోన్ చేసి చెప్పడం గమనార్హం. అయినా అధికారులు వదలలేదు. మరో సారా తయారీదారు అరెస్ట్ విషయంలో ఏకంగా ఎక్సైజ్ మంత్రి పేషీ వరకూ వెళ్లడం గమనార్హం. అక్కడ నుంచి ఆరా తీయగా, అతని మీద ఉన్న కేసులు గురించి వివరించడంతో ఎవరూ మాట్లాడలేదు. ఇటీవల మల్లయ్యపేటలో ఒక మహిళను అరెస్ట్ చేసి ఆరా తీయడంతో వెంకటనగర్‌కు చెందిన వ్యక్తి సారా అమ్ముతున్నట్టు చెప్పడంతో అక్కడకు వెళ్లి, ఆరా తీయడంతోపాటు ఇక మోటారు సైకిల్‌ను నార్త్ స్టేషన్ పోలీసులు తీసుకుని రావడం గమనార్హం. దీంతో ఆ ప్రాంతం నుంచి కొంతమంది మూకుమ్మడిగా నార్త్ ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి, రుబాబు చేశారు. అంతేకాక స్టేట్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన పూర్ణచందర్ అనే కానిస్టేబుల్‌పై చెయ్యి చేసుకున్నారు. దీనిని ప్రభుత్వమూ, ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని, దాడి చేసిన వారిపై త్రీటౌన్‌లో కేసు నమోదు చేశారు. ఇక్కడ రాజకీయ నేతలకు స్థానిక ఎక్సైజ్ సిబ్బంది కూడా అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, సారా తయారీదారులు, వ్యాపారులకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

● నార్త్, సౌత్ స్టేషన్ల సిబ్బంది మార్పు

స్టేట్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌పై వెంకటనగరం సారా వ్యాపారులు దాడి చేసిన సమయంలో స్థానిక ఎక్సైజ్ సిబ్బంది అడ్డుకోలేదని, అంతేకాక నవోదయం-2 అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారని చెబుతూ నార్త్, సౌత్ ఎక్సైజ్ స్టేషన్ల మొత్తం అధికారులు, సిబ్బందిని మార్చేశారు. ఈమేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఇక్కడి సిబ్బంది పని తీరు మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వైఖరి మార్చుకోలేదని ఆయన తెలిపారు. నవోదయం-2ని పగడ్బందీగా అమలు చేయవలసిందేనని ఆదేశించారు. దీంతో సౌత్ స్టేషన్‌లో సీఐ, ఎస్‌తోపాటు మొత్తం 12 మందిని, నార్త్‌స్టేషన్‌లో ఆరుగురిని వేరే చోటకు అటాచ్‌మెంట్ ఇచ్చారు. కానీ నార్త్ స్టేషన్‌లో జరిగిన సంఘటన వల్ల సౌత్ స్టేషన్ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవడం పలు చర్చనీయాంశమైంది. సాధారణంగా కొందరు కింది స్థాయి సిబ్బంది సారా తయారీదార్లకు, వ్యాపారులకు అండగా ఉంటారు. గతంలో నెలవారీ మామూళ్లకు ఒప్పందం కుదిరింది. ఇటీవల చాలా మెరుగైంది. జిల్లాలోని అన్ని స్టేషన్ల కంటే సౌత్ స్టేషన్‌లో రిస్క్ ఎక్కువ. దీని పరిధిలోని రూరల్, రాజానగరం, కడియం మండలాలు ఉన్నాయి. సారా క్రైమ్ ఎక్కువగా రాజానగరం, రూరల్ ప్రాంతాల్లోనే అధికం. ఒత్తిళ్లు కూడా ఎక్కువ. ఇకనైనా రాజకీయనేతలు ఒత్తిడి చేయకుండా ఉంటే ఎక్సైజ్ సిబ్బందీ తప్పుచేయడానికి భయపడతారు.

జిల్లాలో ఎంఎస్‌ఎంఈ బలోపేతానికి ర్యాంప్ పథకం

ఉద్యోగావకాశాలు- స్థానిక పరిశ్రమల అభివృద్ధికి కార్యాచరణ : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఎస్‌ఎంఈ బలోపేతానికి ర్యాంప్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన వార్షిక లక్ష్యాల మేరకు కార్యాచరణ అమలుచేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం అమలుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుని నోడల్ అధికారిగా నియమించారని తెలిపారు. ఎంఎస్‌ఎంఈలకు బలోపేతం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం ఉద్యమ్ నమోదు, నైపుణ్యాభివృద్ధి, స్వంత ఆవిష్కరణలు, కొత్త వ్యాపార ఆలోచనలు, బ్రాండ్ పేర్లు, లోగోలు తదితర విషయాలను రిజిస్టర్ చేసుకుని హక్కులుగా పొందేవిధంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. 2025 జూలై- సెప్టెంబరు వరకు వీటికి సంబంధించి కార్యశాల నిర్వహిస్తామని తెలిపారు.

జాయింట్ పట్టాదారులు విభజనకు మరో అవకాశం

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు, తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకొనేందుకు 2025 డిసెంబరు 31 వరకు అవకాశం కల్పించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో బాగంగా విభజన కోసం సాధారణంగా వసూలు చేసే రూ.500 ప్రభుత్వ రుసుం పూర్తిగా మాఫీ చేశామన్నారు. భూయజమానులు కేవలం రూ.50 నామమాత్రపు రుసుం గ్రామ సచివాలయంలో చెల్లించి డిసెంబరు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక అవకాశం ద్వారా జాయింట్ పట్టాదారులు తమ భూములను విడిగా నమోదు చేసుకొని అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత పొందవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఇబ్బంది పడుతున్న రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే వారికి తొలి ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం కల్పిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో నేడు స్పాట్ అడ్మిషన్లు

ధవళేశ్వరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరానికి ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో సీటు కోసం దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయిన అభ్యర్థులు ఈనెల 23న నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీటు పొందలేకపోయినా, కౌన్సెలింగ్‌కు హాజరై కాలేకపోయినా అటువంటి వారికి మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఈనెల 25న స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు శుక్రవారం నాడు హాజరుకావాలని అయన కోరారు.



పాలిథీన్.. కవర్రీ!

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్
- డబుల్ అయోమయం
- జిల్లా కేంద్రానికే నిషేధం పరిమితం
- జరిమానాలతో చిరు వ్యాపారుల గగ్గోలు
- హోల్‌సేలర్లకు మాత్రం కేవలం వార్నింగే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంకల్పం మంచిదే అయినా తగిన కసరత్తు లేకుండా అమల్లోకి దిగితే సమస్యలు తప్పకపోవచ్చు. సింగిల్ యూజ్ (ఒకసారి మాత్రమే వాడాల్సిన) ప్లాస్టిక్, పాలిథీన్ కవర్ల నిషేధం జిల్లా ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. ముందుగా తగిన విధంగా కసరత్తు లేకుండా ఒక్క ఉదుటున నిషేధం మొదలుపెట్టారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచీ చేతితో సంచి బయటకు తీసుకెళ్లడం అలవాటు లేని జనం ఒక్కసారిగా ఇబ్బందిపడుతున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న పాలిథీన్ కవర్లు కనిపిస్తే జరిమానాలు విధిస్తామని యంత్రాంగం హెచ్చరిస్తుండగా.. వస్త్ర, నార, కాగితం సంచుల వంటి ప్రత్యామ్నాయాలను విరివిగా అందుబాటులోకి తీసుకురాకుండా నేరుగా చర్యలకు దిగడం సబబేనా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. చిరు వ్యాపారులకు పెద్ద జరిమానాలు విధిస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. నిబంధనల ప్రకారం వాడాల్సిన సరుకు అందుబాటులో లేదు. సంచి ఇవ్వకపోతే బేరం పోతోంది. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న చందంగా తమ పరిస్థితి తయారైందని చిన్న దుకాణదారులు ఆవేదన చెందుతున్నారు. పెద్ద దుకాణదారులపై మాత్రం దయ చూపిస్తూ హెచ్చరించి వదిలేస్తుండడంపై విమర్శలు వినవస్తున్నాయి.

● వారికి వార్నింగేనట


రాజమహేంద్రవరంలోని సైకిళ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వారితోపాటు రోడ్డు పక్కన చిన్న హోటళ్లు, కూరగాయల దుకాణదారులు, కిరాణా షాపుల చిరు వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ క్షణంలో ఎవరు వచ్చి ఫైన్ వేస్తారో తెలియని పరిస్థితి ఉంది. పాలిథీన్ కవరు హోల్‌సేల్‌గా ఒక్కోటి 50పైసలకంటే తక్కువే పడుతుంది. అందువల్ల దుకాణదారులకు వాటిని వినియోగదారులకు ఇవ్వడానికి పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు వాటిని నిషేధించడంతో వస్త్ర, నార, కాగితంతో చేసిన వాటిని ఇవ్వాలంటే ఒక్కోటి కనీసం రూ.3పైనే ఉంటుంది. కాబట్టి దుకాణదారులు వెచ్చించలేకపోతున్నారు. అలాగని కవరు ఇవ్వడం ఆపేసి.. చేతిలో పొట్లం పెడితే జనం అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. అందువల్ల చాటుమాటుగా కవర్లు దాచుకొని ఇస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 900 మంది సచివాలయ కార్యదర్శులను, 25 శానిటరీ సర్కిళ్లలోని శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలు, వర్కర్లు సుమారు 1800 మంది ప్రతి రోజూ జల్లెడ పడుతున్నారు. నిబంధన అతిక్రమిస్తే రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకూ ఫైన్ విధిస్తున్నారు. గత ఏడాది జనవరి నుంచీ ఇప్పటివరకూ ప్లాస్టిక్ నిషేధం ఉల్లంఘించిన వారిపై రూ.10 లక్షలకు పైగా జరిమానాలు విధించారు. ఇప్పుడు ఆ తీవ్రతను పెంచారు. అక్టోబరు 2 నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులు కనబడడానికి వీల్లేదని కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే గట్టిగా ఆదేశించారు. అయితే హోల్‌సేలర్లపై మాత్రం దయ చూపిస్తుండడంతో కవర్ల కట్టడి కష్టంగా మారుతోంది. జిల్లాలోని 9మంది హోల్‌సేలర్ల దుకాణాల్లో ఇటీవల కాలుష్య నియంత్రణ అధికారులు సోదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను గుర్తించారు. వాటిలో కవర్లే అధికం. కానీ కేవలం హెచ్చరించి వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● అయోమయం..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పాలిథీన్ కవర్లు జిల్లాలో అక్టోబరు 2 నుంచి కనబడడానికి వీల్లేదని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో కూడా అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నారు. కానీ రాజమహేంద్రవరంలో కొద్దిగా కంట్రోల్ అయినా మిగతాచోట్ల మామూలుగానే లభ్యమవుతున్నాయి. దీంతో ప్రజలు నిషేధం ఉందా? లేదా? ఉంటే.. ఏ పరిధిలో ఉంది? అనే అయోమయంలో పడుతున్నారు. జరిమానాలు విధిస్తున్నారేగానీ జనాల్లో అవగాహన కల్పించడం కనబడడం లేదు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడానికి వాహనాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై అనౌన్స్‌మెంట్ చేయిస్తూ ఉంటే కాస్త మార్పురావచ్చు. అలాగే నార సంచులను విరివిగా అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా హోల్‌సేలర్లపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబు

ముగ్గురు దివ్యాంగులకు రూ.6 వేల నుంచి పెన్షన్ రూ.15 వేలకు పెంపు



గజ్జరంలో సీఎం చంద్రబాబుకు తన దివ్యాంగ కుమారుడికి సహాయం కోరుతున్న ఓ తండ్రి (ఫైల్‌ఫొటో)

రాజమహేంద్రవరం, జూలై24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 1న కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించినప్పుడు ముగ్గురు దివ్యాంగులు పరిస్థితిని చూసి చలించారు. వారు అనారోగ్యంతో వేరే వారి సహాయం లేకపోతే మంచం మీద నుంచి కూడా లేవలేని పరిస్థితి కనిపించడంతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి ఆయన ఆదేశాలు జారీచేశారు. ఇంతవరకూ వారికి దివ్యాంగుల కోటాలో రూ.6 వేలు పింఛన్ వస్తోంది. వారికి ఆరోగ్య పింఛన్‌గా మార్పు చేసి రూ.15 వేలు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన అలజింగి అరుణ, తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన పెంట మధురిమ, కొవ్వూరు మండలం అరికిరేవులకు చెందిన మారిశెట్టి వెంకన్నలకు ఇక నెలనెల ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ కింద రూ. 15 వేల వంతున ఇవ్వనున్నారు. ఆగస్టు 1 నుంచే వీరికి ఆరోగ్య పింఛన్ పేరుతో రూ.15వేలు వంతున అందివ్వనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ పింఛన్ మంజూరు చేసే ముందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, వారి దరఖాస్తులను పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు సిఫార్స్ చేశామన్నారు. వైద్య నివేదికను పరిశీలించి, బాధితులు మానసిక వైకల్యంతో మంచానికే పరిమితమైనట్టు గుర్తించి, దివ్యాంగ పింఛన్‌ను ఆరోగ్య పింఛన్‌గా మార్చినట్టు వివరించారు. పెంచిన పింఛన్ల గురించి సెర్ప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. మలకపల్లిలో పోసిబాబు అనే చర్మకారుడి కుటుంబానికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ఆగస్టు 15వ తేదీలోపు అతని ఇంటిని పూర్తి చేస్తామని కూడా కలెక్టర్ ప్రశాంతి స్పష్టంచేశారు.

అయ్యో... ఏం బాధొచ్చిందో?



● ఆహార ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్ద రెండు మృతదేహాల కలకలం
● సమాచారం ఇవ్వాలని పోలీసుల విన్నపం 7

పాములు.. కాటేస్తాయి.. జాగ్రత్త! 7

రైతులకు ధీమా



పంటల బీమా... ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరి తదితర పంటలకు నష్టం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించిన రైతులకు అండగా నిలుస్తోంది. రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు, సొసైటీలు బీమా ప్రీమియం వసూలు చేసి చెల్లిస్తారు. మిగిలిన రైతులు మాత్రం సచివాలయాలు, పోస్టాఫీసుల ద్వారా, ఆన్‌లైన్‌లో నేరుగా చెల్లించే అవకాశం ఉంది. పంటల బీమాపై వ్యవసాయ శాఖ ప్రచారం చేస్తున్నా రుణాలు తీసుకోని రైతులు అంతగా ఆసక్తి చూపించట్లేదు. ఫలితంగా ఏదైనా నష్టం జరిగినప్పుడు అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- సకాలంలో ప్రీమియం చెల్లిస్తే అండగా నిలుస్తుంది
- దిగుబడి ఆధారంగా పంటలకు బీమా వర్తింపు
- వరికి గ్రామం యూనిట్‌గా అమలు
- రుణాలు తీసుకుంటే బ్యాంకులు, సొసైటీల ద్వారా ప్రీమియం చెల్లింపు
- మిగిలిన రైతులు సచివాలయాల ద్వారా చెల్లించే అవకాశం
- వరికి ఆగస్టు 15 చివరి తేదీ

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గాడిలో పెట్టింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అమలు బాధ్యతను జిల్లాల వారీగా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించారు. కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో పంటల బీమా పథకాన్ని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేయనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ పథకాన్ని టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేస్తారు. వీరు నోడల్ ఏజెన్సీలుగా ఉండి రైతుల నుంచి ప్రీమియం వసూలు, నష్టాలు జరిగినప్పుడు పరిహారం చెల్లిస్తారు.

వర్తింపు ఇలా ...

జిల్లాల వారీగా ఎంపిక చేసిన పంటలకే బీమా వర్తింపచేస్తున్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో దిగుబడి ఆధారిత బీమా అమలులో ఉంది. వరి తదితర పంటలకు బీమా మొత్తానికి 1.5 నుంచి 2 శాతం వంతున రైతులు ప్రీమియంగా చెలిస్తే సరిపోతుంది. వరి పంటకు గ్రామం యూనిట్‌గా బీమాను అమలు చేస్తారు. పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని, గత ఏడు సంవత్సరాల ఆధారంగా లెక్కించిన సగటు దిగుబడిని పోల్చి ఏ మేరకు దిగుబడి తగ్గిందో అంతమేర శాతాన్ని పరిహారంగా చెల్లిస్తారు. ఇందుకు ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని దిగుబడి లెక్కలు వేస్తారు.

ఎలా చెల్లించాలి

పంటలకు ప్రభుత్వం, బీమా సంస్థలు నిర్దేశించిన ప్రీమియంలో రైతు వాటాను చెల్లించి పంటల బీమా పొందవచ్చు. ఇందుకు రైతులతో పాటు కౌలు రైతులూ అర్హులే. ఏయే పంటలకు బీమాను వర్తింపచేశారో ఆ పంటలకు సంబంధించి బ్యాంకులు, సొసైటీలు ద్వారా రుణం పొందినప్పుడు వారే బీమా ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తారు. ఒకవేళ బీమా మంజూరైతే సంబంధిత రైతు రుణ ఖాతా ద్వారా పరిహారం చెల్లిస్తారు.

రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు గ్రామ, వార్డు సచివాలయాలు, పోస్టాఫీసుల ద్వారా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి. ఇందుకు రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం, లేదా కౌలు రైతు కార్డు, పంట వేసినట్టు ధ్రువపత్రం, బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలి. లేకుంటే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ (ఎన్‌సీఐపీ) పోర్టల్ ద్వారా రైతులే నేరుగా తమ వివరాలు నమోదు చేసి ప్రీమియం చెల్లించవచ్చు. పంట నష్టం జరిగి పరిహారం వస్తే వారు ఇచ్చిన బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. బీమా చేసిన పంటల వివరాలు ఈ-క్రాప్‌లో సక్రమంగా నమోదయ్యాయో లేదో రైతులు తప్పనిసరిగా చూసుకోవాలి.

స్పందన అంతంతమాత్రమే

పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించడం ద్వారా సాగుకు ధీమా ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం సాగిస్తున్నా రైతుల నుంచి అంతంతమాత్రంగానే స్పందన లభిస్తోంది. రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు, సొసైటీలే ప్రీమియం వసూలు చేసి చెల్లిస్తున్నందున వారందరికీ బీమా వర్తిస్తోంది. వీరికి రెండు, మూడు రెట్లు అధికంగా రుణాలు తీసుకోని రైతులు ఉంటారు. వీరిలో కనీసం ఒక శాతం మంది రైతులు కూడా ఇప్పటిదాకా ప్రీమియం చెల్లించలేదు. గతంలో లెక్కలను పరిగణలోకి తీసుకున్నా వీరిది ఎప్పుడూ 3-4శాతం లోపుగానే ఉంది.

మిగిలిన పంటలకు నెలాఖరు వరకే

ఎంపిక చేసిన వరి కాకుండా మిగిలిన పంటలకు పంటలకు రైతులు బీమా చేయించుకునేందుకు ఈ నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలి. వరికి మాత్రం ఆగస్టు 15 వరకు అవకాశం ఉంది. బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు తీసుకునే రైతులకు ఇదే గడువు వర్తిస్తుంది. కాకినాడ జిల్లాలో వరికి ఎకరానికి రూ.769.23, తూర్పు గోదావరి జిల్లాలో రూ.576.92, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో రూ.646.15 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆయా జిల్లాల పరిస్థితుల ఆధారంగా ప్రీమియం, రైతు వాటాగా చెల్లించాల్సిన మొత్తాలను నిర్ధారించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం ఎకరాకు కేవలం రూ.76 చెల్లిస్తే సరిపోతుంది.

సకాలంలో ప్రీమియం చెల్లించాలి

పి.స్వాతి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు, పిఠాపురం



ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేసే రైతులు సకాలంలో ప్రీమియం చెల్లించడం ద్వారా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు, వరదల కారణంగా పంటలకు నష్టం జరిగితే గ్రామం యూనిట్‌గా అంచనాలు వేసి పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లిస్తారు. దీనివల్ల రైతులకు పంటలపై పెట్టే పెట్టుబడికి భరోసా లభిస్తుంది. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకులు, సొసైటీలు ద్వారా తీసుకోని రైతులు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ ప్రీమియాన్ని ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించాలి.

జిల్లా	పంట	బీమా యూనిట్	బీమా మొత్తం (ఎకరా/హెక్టారు)	రైతుల వాటా (శాతం)	ప్రీమియం మొత్తం (ఎకరా/హెక్టారు)
కాకినాడ	వరి	గ్రామం	38,462/95,000	2.00	769.23/1900.00
తూర్పు గోదావరి	వరి మినుము	గ్రామం మండలం	38,462/95,000 20,243/50,000	1.50 1.50	76.92/1425.00 303.64/750.00
అల్లూరి	వరి మొక్కజొన్న రాగి పసుపు	గ్రామం మండలం మండలం జిల్లా	42,510/1,05,000 33,401/82,500 17,206/42,500 89069/2,20,000	1.52 1.50 1.50 1.50	646.15/1596.00 501.01/1237.50 258.10/637.50 1336.03/3300.00
కోనసీమ	వరి	గ్రామం	38,000		76.00

పౌరుల సేవలో పుర మిత్ర

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నివసిస్తున్న ప్రజలు వారి సమస్యలపై ఇక నుంచి కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అనేక పౌర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 'పుర మిత్ర' యాప్‌కు రూపకల్పన చేసింది. ఏఐ సహకారంతో రూపొందించిన ఈ యాప్ పుర పౌరులకు అందుబాటులోకి వచ్చింది.



- ఇక ఇంటి నుంచే దరఖాస్తులు, ఫిర్యాదులు
- అందుబాటులోకి వాట్సాప్ యాప్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): పుర మిత్ర యాప్ అందుబాటులోకి రావడంతో దరఖాస్తులు ఇచ్చేందుకు మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేదు. క్యూలైన్లలో వేచి ఉండక్కర్లేదు. ఇంట్లోనే కూర్చుని ఫిర్యాదు చేయొచ్చు. ఇతర సేవలు పొందవచ్చు. ప్రస్తుతం ప్రతి సోమవారం పురపాలక కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అక్కడికి వెళ్లి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పుడు పురమిత్ర యాప్‌లోనే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు పొందడంతో పాటు అన్ని రకాల బిల్లులను ఈ యాప్ ద్వారా చెల్లించే వెసులుబాటు కల్పించారు.

150 రకాల సేవలు

మొబైల్‌లో ప్లే స్టోర్‌కి వెళ్లి పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో రెవెన్యూ, ప్రజారోగ్యం, తాగునీరు, పట్టణ ప్రణాళికా విభాగం, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, అకౌంట్స్, పరిపాలనా విభాగం పొందుపరిచారు. దశలవారీగా 150 రకాల సేవలను పురమిత్ర యాప్ ద్వారా వినియోగించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పురప్రజలకు కల్పించింది.

చిత్రం తీసి.. వాయిస్ రికార్డింగ్..

ఆయా ప్రాంతాల్లో సమస్యకు సంబంధించిన చిత్రాన్ని తీసి.. వాయిస్ రికార్డు చేస్తే అక్షరాలు టైప్ అయ్యేలా యాప్ రూపొందించారు. పంపిన సమస్యకు సంబంధించిన సమాచారం సంబంధిత విభాగ అధిపతులకు నేరుగా చేరుతుంది. ఆ సమస్య తీవ్రతను బట్టి పరిష్కరించేందుకు మూడు నుంచి 15 రోజులు, గరిష్ఠంగా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు.

పరిష్కరించకపోతే...

పురమిత్ర యాప్‌లో పొందుపరిచిన సమస్యను సంబంధిత అధికారి గడువులోగా పరిష్కరించాలి. ఆ చిత్రాన్ని యాప్‌లో అధికారి అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం వల్ల ఫిర్యాదుదారులు పురోగతి తెలుసుకునేందుకు వీలవుతుంది. ఒకవేళ అధికారి స్పందించి సమస్యపై పరిష్కరించకపోతే అది పైస్థాయి అధికారి పరిగణలోకి వెళ్తుంది. ఆపై సంబంధిత అధికారి బాధ్యుడు అయ్యేలా యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది.

ప్రచారానికి నోచుకోని యాప్

ప్రభుత్వం ఈ యాప్‌ను మంచి ఉద్దేశ్యంతో తీసుకొచ్చినప్పటికీ తగిన ప్రచారం లేక ప్రజలకు అందుబాటులోకి రావట్లేదు. వారు పలు సమస్యలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు అందిస్తున్నారు. ఇలాంటి యాప్ ఒకటి అందుబాటులోకి వస్తే ప్రజల నుంచి మరిన్ని సమస్యలు అందుకోవాల్సి ఉంటుందని భయంతో అధికారులు గోప్యంగా ఉంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తగిన ప్రచారం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చేపలవేటలో టిండాల్ కమ్ డ్రైవర్ కోర్సులో శిక్షణ

ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ అంజలి

కాకినాడ సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా యంత్రపు నావ, బోటులో చేపలవేట సాగించేవారికి టిండాల్ కమ్ డ్రైవర్ కోర్సులో ఏడాది పాటు శిక్షణ ఇస్తున్నట్టు రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ(ఎస్ఐఎఫ్‌టీ) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అంజలి తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 74వ బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు, పుదుచ్చేరి నుంచి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్ల జెరాక్స్‌లు జతపరచి ఆయా జిల్లాల మత్స్యశాఖ అధికారి వారి కార్యాలయంలో అందజేయాలన్నారు. నేరుగా కూడా ఈ కార్యాలయానికి అందేటట్టు పోస్టల్ ద్వారా పంపవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీ ఉదయం 10గంటలకు కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతి పరిజ్ఞాన సంస్థలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. దరకాస్తు నమూనా, పూర్తి వివరాలు ఈ నెల 25వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయని ప్రిన్సిపాల్ అంజలి పేర్కొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘంలో అక్రమాలు

- విచారణ చేయాలి.. నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిపించాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్‌కు డ్రైవర్ల వినతి



కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ వాహనాల డ్రైవర్లు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖలో గత పాలకవర్గం పాల్పడిన అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ప్రభుత్వ డ్రైవర్లు సరిపల్లి కృష్ణవర్మ, జి.రాంబాబు, కె.రవికుమార్, పి.శ్రీనివాస్‌లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత పాలకవర్గంలో ఉన్న ఎస్.శ్రీనివాసరావు హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రూ.1.40 కోట్లకు లెక్కలు చూపించడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సంఘం నిబంధనల ప్రకారం ఆడిట్ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. అలాగే ఎనిమిదేళ్ల నుంచి సంఘం ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దుర్వినియోగం అయిన సొమ్మును అప్పటి అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి నుంచి రికవరీ చేయించాలని ప్రభుత్వ డ్రైవర్లు డిమాండ్ చేశారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.52 కోట్లు

హుండీల లెక్కింపు.. బంగారం 47 గ్రాములు, వెండి 1.600 కిలోలు, 24 విదేశీ కరెన్సీ నోట్లు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యాలు



ఆత్రేయపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. పర్యవేక్షణాధికారులు డి.సురేష్‌బాబు, డీవీఎస్ఆర్ ప్రసాద్ సమక్షంలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 28 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.1,26,78,200, అన్నప్రసాద హుండీల ద్వారా రూ. 26,12,993 వెరసి రూ.1,52,91,193 ఆదాయం లభించింది. అలాగే బంగారం 47 గ్రాములు, వెండి 1.600 కిలోలు, 11 దేశాల 24 విదేశీ కరెన్సీ నోట్లు హుండీ ద్వారా లభించిన్నట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్థులు, చైతన్య గోదావరి బ్యాంకు ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ జీఎస్ఎల్

- జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ముగిసిన మహిళా గేమ్స్ మీట్
- 24 కళాశాలల నుంచి 547 మంది విద్యార్థినులు హాజరు
- క్రీడలు దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తాయి
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన జీఎస్ఎల్ జట్టు, మాట్లాడుతున్న డాక్టర్ రాధికారెడ్డి



రాజానగరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): క్రీడలు దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తాయని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల 25వ మహిళా గేమ్స్ మీట్ గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎస్ మిశ్రా అధ్యక్షత జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ అన్ని రంగాల్లో ముందంజలో ఉంటే దానిలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ముందడుగు వేస్తోందన్నారు. జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనలో రాజీపడేది లేదని డాక్టర్ గన్ని స్పష్టం చేశారు. యూనివర్శిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ ఇ.త్రిమూర్తి మాట్లాడుతూ 24 కళాశాలల నుంచి 527 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, ఓవరాల్ చాంపియన్ షిప్‌ను జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ సొంతం చేసుకుందన్నారు.

విజేతల వివరాలు...

- బాస్కెట్ బాల్ పోటీల్లో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) జట్టు విన్నర్‌గా, పీఎస్ఐఎంఎస్(చిన్నఅవుట్లపల్లి) రన్నర్‌గా, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల(గుంటూరు), ఎంఐఎంఎస్ (విజయనగరం) తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి.
- వాలీబాల్ పోటీల్లో ఆశ్రమ్ మెడికల్ కళాశాల(ఏలూరు), పీఎస్ఐఎంఎస్ కళాశాలలు సంయుక్తంగా విన్నర్స్‌గా నిలవగా, సిద్ధార్థ మెడికల్ కళాశాల(విజయవాడ), రంగరాయ మెడికల్ కళాశాల (కాకినాడ) మెడికల్ కళాశాలలు తృతీయ స్థానాల్లో నిలిచాయి.
- త్రోబాల్ పోటీల్లో కోనసీమ మెడికల్ కళాశాల(అమలాపురం) విన్నర్‌గా, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) రన్నర్‌గా నిలవగా, నారాయణ డెంటల్ కాలేజీ(నెల్లూరు), కోనసీమ డెంటల్ కాలేజీ (అమలాపురం) తృతీయ స్థానంలో నిలిచాయి.
- బ్యాడ్మింటన్ పోటీల్లో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల విన్నర్‌గా, రంగరాయ మెడికల్ కళాశాల(కాకినాడ) రన్నర్‌గా నిలిచాయి. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల, ఆశ్రమ్ మెడికల్ కళాశాలలకు తృతీయ స్థానం లభించింది.
- బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆశ్రమ్ మెడికల్ కళాశాల విన్నర్‌గా, సిద్ధార్థ మెడికల్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. అనిల్ నీరుకొండ డెంటల్ కళాశాల(వైజాగ్), మహారాజా మెడికల్ కళాశాల (విజయనగరం)లు తృతీయ స్థానంలో నిలిచాయి.
- చదరంగం పోటీల్లో రంగరాయ మెడికల్ కళాశాల విన్నర్‌గా, సిద్ధార్థ మెడికల్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల, గవర్నమెంట్ కాలేజీ(గుంటూరు)ల సంయుక్తంగా తృతీయ స్థానం దక్కింది.
- టెన్నిస్ పోటీల్లో ఎన్ఆర్ఐ కళాశాల (చిన్నకాకాని) విన్నర్‌గా, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల (వైజాగ్) రన్నర్ కైవశం చేసుకున్నాయి. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, సిద్ధార్థ మెడికల్ కళాశాలలు తృతీయ స్థానంలో నిలిచాయి.
- టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల(చిన్నకాకాని) విన్నర్‌గా, గాయత్రి మెడికల్ కళాశాల(వైజాగ్) రన్నర్‌గా నిలిచాయి. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయని ఎన్టీఆర్ హెల్త్ విశ్వ విద్యాలయం స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ త్రిమూర్తి తెలిపారు.

సముద్ర తీరంలో అలల ఉధృతి



ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాల ఉధృతి

కొత్తపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి కొనసాగుతోంది. సముద్రం ఉప్పొంగడంతో బుధవారం మాయాపట్నంలో సుమారు 10 మత్స్యకార గృహాలు కొట్టుకొనిపోవడం, సముద్రం నీరు ఇళ్లల్లోకి చేరడం విధితమే. తీరంలో అలల ఉధృతి కారణంగా మత్స్యకారుల్లో కొంత మంది వేటను స్వచ్ఛందంగా విరమించారు. గురువారం అమావాస్య కావడంతో రాత్రిపూట సముద్రం మరింత ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని మత్స్యకారపెద్దలు చెబుతున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల మత్స్యకారులు వేట సామాగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు.

ఒకేసారి.. ఒకే వేదికపై ఐదు స్వర్ణ పతకాలు

జ్వాలకు గవర్నర్ ప్రత్యేక అభినందన



పతకాలు అందుకుంటున్న జ్వాల

అమలాపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన మోర్త జ్వాల ఒకేసారి ఒకే వేదికపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఐదు స్వర్ణ పతకాలు అందుకుంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని గురువారం విజయవాడ సమీపంలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్టులో నిర్వహించారు. 2023 బ్యాచ్‌కు చెందిన జ్వాల యూనివర్శిటీ టాపర్‌గా నిలిచింది. దాంతో శ్రీనీలంరాజు గంగాప్రసాదరావు అండ్ కమల గోల్డ్ మెడల్, శ్రీపరిసాయనాది మెమోరియల్ గోల్డ్ మెడల్, మణి మట్లపూడి మెమోరియల్ గోల్డ్ మెడల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గోల్డ్‌మెడల్, శ్రీరాజా ఇమ్మానియేల్‌రాయల్ కొండేటి గోల్డ్‌మెడల్‌ను ఒకేసారి జ్వాలకు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్‌తోపాటు జ్వాలను వైస్ చాన్సలర్ వి.శారదజయలక్ష్మి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఏపీ వేణుప్రసాద్, ఎం.హరిజవహర్‌లాల్ ప్రత్యేకంగా అభినందించారు.

అక్టోబరు 9 నుంచి రెవెన్యూ స్పోర్ట్స్ మీట్

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకి నాడ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ నిర్వహణకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అనుమతి ఇచ్చారని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు తెలిపారు. గురువారం ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. అనంతరం త్రినాథరావు మీడియాతో మాట్లాడుతూ అక్టోబరు 9 నుంచి 11వ తేదీ వరకు జిల్లా స్థాయి రెవెన్యూ మీట్ నిర్వహిస్తామన్నారు. నవంబరులో స్టేట్ స్పోర్ట్స్ మీట్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు, కాకినాడ అర్బన్ తహశీల్దారు జితేంద్ర, ఇతర ప్రతినిధులు సంధ్యారాణి, రమ్య పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి ప్రవాహం

2.16లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి.. డెల్టా కాలువలకు 9100 క్యూసెక్కులు ..



సముద్రంలోకి ప్రవహిస్తున్న వరదనీరు

ధవళేశ్వరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు వల్ల ఒక మోస్తరు వర్ష ప్రవాహం గోదావరికి తరలివస్తుంది. గురువారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, మద్దూరు, ర్యాలీ ఆర్మ్‌లలోని మొత్తం గేట్లను అరమీటరు మేర, విజ్జేశ్వర్ ఆర్మ్‌లోను 39 గేట్లకు గాను 14 గేట్లను 30 మీటర్ల మేర పైకి ఎత్తి 2,16,302 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది.వర్షాలు కురుస్తుండడంతో డెల్టా కాలువలకు నీటి విడుదలను మరింత తగ్గించారు.తూర్పుడెల్టాకు 3300 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3700 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.ఎగువున భద్రాచలం వద్ద 21 అడుగుల వరకు పెరిగిన ఆపై తగ్గుతూ సాయంత్రానికి 20.60 అడుగులకు చేరుకుంది.



కాటేస్తాయి.. జాగ్రత్త!

● పొంచి ఉన్న విషసర్పాల ముప్పు ● జాగ్రత్తగా లేకుంటే ప్రాణాలకే అపాయం ● వరదలు, వర్షాలతో జనావాసాల్లోకి విషసర్పాలు

● ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న పాముకాటు బాధితులు ● నెలలోపు పది మంది వరకు మృతి

విషసర్పాలు మాటేస్తున్నాయి.. జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.. కాస్త అజాగ్రత్తగా ఉంటే కాటేస్తున్నాయి.. వర్షాలు, వరదల నేపథ్యంలో పాములతో జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి. ఇటీవల కాలంలో రెండు, మూడు నెలలుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. మామూలు రోజుల్లో కూడా ఒక్కోసారి బయట సంచరించే సర్పాలు వర్షాలు పడేసరికి ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం ఇరుసుమండకు చెంది న తోట శ్రీనివాసరావు(58) ముక్కామలలో బొండాలు విక్రయిస్తుంటాడు. ఈనెల 16వ తేదీ రాత్రి ఖాళీ బొండాలు తీస్తున్న సమయంలో వాటిలో ఉన్న రక్తపింజర పాము కాటేసింది. దీంతో అతడు మృతి చెందాడు.

● గోకవరం మండలంలోని కొత్తపల్లికి చెందిన తెంటి రవీనామాధురి(22) పాముకాటుకు గురై మృతి చెందింది. జూన్ 24వతేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటివద్ద దుస్తులు ఉతుకుతుండగా నల్లతాచు కుడికాలిపై కాటువేసింది. వెంటనే తండ్రి శ్రీనివాసరావు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది.

● తాళ్లరేవు మండలం పటవలకు చెందిన వడ్డి సంజన(17) ఈనెల 21న ఉదయం ఇంటి పరిసరాల్లో పాము కాటుకు గురైంది. దీంతో వెంటనే ఆమె తల్లి మోటారుసైకిల్‌పై తాళ్లరేవు సీహెచ్‌సీకితీసుకువెళుతుండగా మార్గంమధ్యలో అపస్మారక స్థితికి చేరింది. తర్వాత చికిత్సపొందుతూ ప్రాణాలు విడిచింది.

● తాజాగా ముమ్మిడివరంలో గురువారం ఓ మహిళ పాముకాటుకు గురైంది. వీరే కాదు.. ఇటీవల కాలంలో అనేకమంది పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషసర్పాల బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. బాధితులకు తక్షణ వైద్యసాయం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఆస్పత్రుల్లో యాంటీ వీనమ్ మందు అందుబాటులో ఉన్నా, సమయానికి చేరుకోలేక కొందరు, ఆందోళనతో మరికొందరు ప్రాణాలు విడుస్తున్నారు. మంత్రాలు, నాటు వైద్యం అంటూ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలకు ముప్పువాటిల్లే పరిస్థితులు తెచ్చుకుంటున్నారు.

పాము కాటుకు గురైన బాధితులను ఆరు గంటలలోపు ఆసుపత్రిలో చేర్చాలి. గాయమైన చోట కట్టు కట్టకుండా శుభ్రంగా కడిగి ఆసుపత్రికి తరలించాలని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం కాకినాడ సెంట్రల్ డ్రగ్ స్టోర్(సీడీఎస్)లో ప్రస్తుతం 4500 వైల్స్ అందుబాటులో ఉన్నాయని, కాకినాడ జీజీహెచ్‌లో 2500 సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జీజీహెచ్‌లు, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు మొత్తం 5వేలకుపైగా డోసులు పంపిణీ చేసినట్టు సీడీఎస్ అధికారులు తెలిపారు.

ఇలాగా చేయాలి..

ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పాములు సంచరించడానికి ఆస్కారం లేకుండా చూసుకోవాలి. పరిసరాల్లో పిచ్చిమొక్కలు, పొదలు లేకుండా చేయాలి. రాత్రివేళ బయట కచ్చితంగా లైట్ వేసుకునే వెళ్లాలి. అవసరమైతే టార్చ్ సాయంతో బయటకు రావాలి. దగ్గర్లో ఎవరైనా స్నేక్ క్యాచర్ ఉంటే అతడితో పాములను పట్టివేయించాలి. అనుమానం ఉంటే.. పరిసరాల్లో పాములు రాకుండా రసాయన మందులు పిచికారీ చేయించుకోవాలి. ఇటీవల కాలంలో బైకుల్లోకి, బూట్లలోకి, వాషింగ్‌మెషీన్లలోకి మనం ఏమాత్రం ఊహించని కొన్ని వస్తువుల్లోకి సైతం విషసర్పాలు చేరుతున్నాయి. ఇలాంటి బయట ఉన్న వస్తువులను బాగా పరిశీలించిన తర్వాత మాత్రమే వాడాలి.

వర్షాకాలంలో అధికం..

ఏటా వర్షాకాలం, వరదల సమయాల్లో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలంలో పాములు పుట్టలు, ఇతర ప్రాంతాలనుంచి బయటకు వస్తుంటాయి. వేడి ప్రాంతాలను ఎంచుకునే సమయంలో నివాసగృహాల చెంతకు చేరుతాయి. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు, గోదావరి వరదల సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచివచ్చేనీటిలో కొట్టుకొస్తాయి. వీటి ఆవాసాలకు లంకలు అనువుగా ఉండడంతో సర్పాల సంతతిపెరుగుతుంది.

కరిస్తే.. ఇలా చేయాలి..

పాము కరిచిన చోట కట్టుకట్టకూడదు. ఆ ప్రాంతాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. కాటు వేసిన భాగంనుంచి విషం తీసేందుకు చాలా మంది ప్రయత్నిస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారు. ఇలా చేయడం అత్యంత ప్రమాదకరం. కరిచిన పామును కచ్చితంగా గుర్తించాలి. అవసరమైతే దాన్ని పట్టుకుని ఆస్పత్రికి తీసుకురావాలి కూడా. అప్పుడే దానికి సంబంధించిన విరుగుడు మందును వైద్యులు ఇచ్చే అవకాశం ఉంది. లేకుంటే అది ఏ జాతికి చెందిన విషసర్పమో తెలియజేయాలి.

పాము కాటుకు వివాహిత మృతి


మృతిచెందిన ప్రవల్లిక(ఫైల్)

ముమ్మిడివరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన ఓ వివాహిత పాముకాటుకు గురై మృతి చెందింది. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన యనమదల ప్రవల్లిక (27) గురువారం తెల్లవారుజామున మరో మహిళతో కలిసి ఇంటి నుంచి వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఏదో కాటు వేసినట్టు అనిపించడంతో ఆమె పక్కనున్న మహిళకు చెప్పగా కాటువేసిన విషసర్పం వెళ్లిపోవడాన్ని వారు గమనించారు. ఈ విషయాన్ని ఆమె వెంటనే భర్త శివకు ఫోన్‌లో తెలపగా అతని సోదరుడితో కలిసి కారులో ఆమెను హుటాహుటీన ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రవల్లికకు భర్త శివ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కొండచిలువ హల్‌చల్

● గ్రామస్థుల చేతిలో హతం


గ్రామస్థుల చేతిలో హతమైన కొండచిలువ

నల్లజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా నల్లజర్ల మండల కేంద్రమైన నల్లజర్లలో భారీ కొండచిలువ బుధవారంరాత్రి హల్‌చల్ చేసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెనుక ఉన్న మొక్కల్లో నుంచి సుమారు 10అడుగులు ఉండే భారీ కొండచిలువ పులి భాస్కరరావు ఇంటి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆ మార్గంలో బైక్‌పై వస్తున్న భాస్కరరావు గుర్తించాడు. దీంతో స్థాని కులను అప్రమత్తం చేసే సమయానికి ప్రక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లిపోయింది. అక్కడ నివాసం ఉండే స్థానికులు ప్రాణభయంతో కొండచిలువను ఏలా హతమార్చాలని అనేక ప్రయత్నాలు చేశారు. చివరికి ట్రాక్టర్ సహాయంతో పొదలు ఉన్న ప్రాంతాన్ని దున్ని వేయడంతో కొండచిలువ బయటపడింది. దీంతో స్థానికులు గునపాలు, కర్రలతో హతమార్చారు. భారీ కొండచిలువ మృతి చెందిందని నిర్ధారించుకున్నాక స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. మృతి చెందిన కొండ చిలువను అటవీ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.



ఉభయ గోదావరి జిల్లాల వారధికి మరమ్మతులు

దిండి-చించినాడ మధ్య హెచ్చరిక బోర్డుతో మరమ్మతులకు సిద్ధమైన వారధి

● దిండి-చించినాడ మధ్య భారీ వాహనాల రాకపోకలు బంద్

● లైట్‌వెయిట్ వాహనాలకు మాత్రమే అనుమతి

● ఉభయగోదావరి జిల్లాల్లో వాహనాల మళ్లింపు

● కోనసీమ జిల్లా కలెక్టర్ ప్రకటన

● అధికారులతో సమీక్ష


అమలాపురంలో కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ఠనదిపై దిండి-చించినాడ మధ్య ఉన్న వారధి మరమ్మతుల కారణంగా భారీ వాహనాలను వివిధ మార్గాల ద్వారా మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. లైట్‌వెయిట్ వెహికల్స్‌ను మాత్రమే ఈ వారధిపై అనుమతించడానికి నిర్ణయించారు. 216 జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా దిండి-చించినాడ మధ్య 1995లో నిర్మించిన ఈ వారధి ప్రస్తుతం అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉన్నందున వాటిని చేపట్టేందుకు వీలుగా వారధిపై ప్రయాణించే వాహనాలను వివిధ ప్రాంతాల గుండా మళ్లిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు గురువారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రకటించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, రోడ్డు రవాణాశాఖ అధికారులు, ఆర్టీసీ, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి వారధిపై భారీ వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ సూచనలతో ఈ వారధిపై అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సిన దృష్ట్యా ఆ పనులు పూర్తయ్యే వరకు భారీ వాహనాలను మళ్లిస్తామని తెలిపారు. లైట్‌వెయిట్ వెహికల్స్ మాత్రం గరిష్ఠంగా గంటకు 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడానికి మాత్రమే అనుమతి ఉందని మిగిలిన అన్ని వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిన దృష్ట్యా ఆవిధంగా మరమ్మతులు పూర్తయ్యే వరకు వెళ్లాల్సిందిగా కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, ఆర్టీసీ ఆర్‌ఎం రాఘవశ్రీనివాస్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ సాయిశ్రీనివాస్, ఏఈ వెంకటరమణతోపాటు అధికారులు పాల్గొన్నారు.

వాహనాలు మళ్లించిన రూట్లు ఇలా..

● కాకినాడ నుంచి నర్సాపురం-భీమవరం వైపు వెళ్లే వాహనాలు రావులపాలెం వంతెన మీదుగా సిద్ధాంతం నుంచి వెళ్లాలి.

● కాకినాడ, రామచంద్రపురం, మండపేట నుంచి వెళ్లే వాహనాలు రావులపాలెం-సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వెళ్లాలి.

● అమలాపురం నుంచి నర్సాపురం, భీమవరం వైపు వెళ్లే వాహనాలు అమలాపురం, కొత్తపేట, రావులపాలెం, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వెళ్లాలి.

● తాటిపాక, రాజోలు నుంచి నర్సాపురం వైపు వాహనాలు తాటిపాక, పి.గన్నవరం, ఈతకోట, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం చేరుకోవాలి.

● యానాం నుంచి పాలకొల్లువైపు వెళ్లే వాహనాలు ద్రాక్షారామం, రావులపాలెం, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వెళ్లాలి.

● నర్సాపురం నుంచి రాజోలు వైపు వచ్చే వాహనాలు దిగమర్రు, పాలకొల్లు, సిద్ధాంతం, రావులపాలెం మీదుగా రాజోలు చేరుకోవాలి.

స్మార్ట్ మీటర్ల బిగింపుపై అపోహలు వద్దు

● ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్

కాకినాడసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరంలేదని, వీటివల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ (ట్రాన్స్‌కో) సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ వెల్లడించారు. ఈమేరకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియకు సంబంధించిన వివరాలను గురువారం ఓ ప్రకటనలో వివరించారు. వినియోగం, బిల్లు నియంత్రణ వినియోగదారుల చేతుల్లోనే ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో భాగంగా అన్నిరాష్ట్రాల్లో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందన్నారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. దీని ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామన్నారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన గృహ వినియోగదారులకు వీటిని అమరుస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవు..

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదుగాని, ఛార్జీలు గాని, మామూళ్లుగాని చెల్లించాల్సి అవసరంలేదని ఎస్‌ఈ తెలిపారు. విద్యుత్ బిల్లుతోపాటు నెలవారీగా ఎటువంటి ఇన్‌స్టాల్‌మెంట్లు వసూలు చేయరని స్పష్టం చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటువల్ల వినియోగదారులపై విపరీతమైన భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాతమీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవన్నారు. విద్యుత్ బిల్లులు పెరగవన్నారు.

మరింత పారదర్శకంగా ఏర్పడుతుంది..

పాతమీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత ఏర్పడుతుందని ఎస్‌ఈ పేర్కొన్నారు. వినియోగదారులకు ప్రస్తుత విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించడానికి, వినియోగాన్ని సరిపోల్చడానికి స్మార్ట్‌మీటర్లు సహకరిస్తాయన్నారు. స్మార్ట్ మీటర్ల కన్స్యూమర్ యాప్ ద్వారా వారంలో 7 రోజులు 24 గంటలు కనెక్ట్ అయ్యి ఉంటాయన్నారు. ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. అధిక వినియోగాన్ని నియంత్రించుకుంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు సహకరిస్తాయని చెప్పారు. పవర్ ట్రిప్ అయిన సమయంలో త్వరితగతిన గుర్తించి తద్వారా విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్దరించేందుకు వీలు కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో వినియోగదారులకు సహాయపడటానికి సంబంధించి వివిధ రకాల స్మార్ట్ వినియోగ అలెర్ట్‌లను ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించవచ్చని ఎస్‌ఈ వెల్లడించారు.

బలవంతంగా వ్యభిచారంలోకి దింపారు

● భారతిని కఠినంగా శిక్షించాలి

● భారతి నుంచి మాకు ప్రాణ హాని ఉంది

● పోలీసులు భారతికి పూర్తిగా సహకారం అందించారు

● కాకినాడజిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన బాధితురాలు


దళిత సంఘాల నాయకులతో జిల్లా కలెక్టర్‌ను కలిసిన బాధితురాలు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 24(ఆంధ్ర జ్యోతి): తనను బలవంతంగా వ్యభిచారంలోకి దింపిన పెద్దాపురానికి చెందిన వ్యభిచార గృహం నిర్వాహకురాలు గొల్లవిల్లి భారతిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు డిమాండ్ చేసింది. గురువారం ఆమె కాకినాడజిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసి వినతిపత్రం అంద జేశారు. తనతో పాటు తన బిడ్డకి, తన సహాయకురాలికి భారతి నుంచి ప్రాణహాని ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోటకు చెందిన తాను ఏడేళ్ల క్రితం పెద్దాపురంలోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తుండగా భారతి పరిచయమైందన్నారు. తన ఇంట్లో పనిచేస్తే నెలకు రూ.15వేలు ఇస్తానని నమ్మబలికిందని చెప్పింది. తనను 17ఏళ్ల వయసులోనే బలవంతంగా వ్యభిచారంలోకి దింపిందని, ఈ క్రమంలో గర్భవతి అయ్యానంది. అయినప్పటికీ తనతో బలవంతంగా వ్యభిచారం చేయించింద ని, తాను ఒక పాపకు జన్మనిచ్చినట్లు వెల్లడించింది. తాను ప్రసవం సమయంలో తన బిడ్డను వేరుచేసి వేరేచోట పెంచారని, తాను వ్యభిచారం చేయకపోతే బిడ్డను చంపేస్తామని బెదిరించి వ్యభిచారం చేయించారన్నారు. తనతో బ్యాంకు ఖాతా తెరిపించి బ్యాంకుకు చెందిన ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని బెదిరించారని పేర్కొన్నారు. వారికి కానిస్టేబుల్, హోంగార్డులు సహకరించారని ఆరోపించారు. పెద్దాపురం ఎస్‌ఐకి, ప్రత్తిపాడు ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఈనేపథ్యంలో ఈ వ్యవహారాన్ని పెద్దాపురం డీఎస్పీకి, కాకినాడ ఎస్పీకి ఫిర్యాదు చేయగా తన బిడ్డను తనకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనకు ప్రాణహాని ఉన్నందున తనతోపాటు తన స్నేహితురాలు సాయికళతో కలిసి ఉంటున్నట్టు చెప్పారు. భారతితోపాటు ఆమెకి సహకరించిన పోలీసులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సంఘంలో తాను గౌరవప్రదంగా జీవించడానికి ఉపాధి కల్పించాలని కోరారు. ఆమె వెంట ఆంధ్ర మాలమహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, డీబీఎఫ్ జాతీయ సమన్వ యకర్త తోటి చెంగల్‌రావు, భైభీమ్‌రావ్ భారత పార్టీ పీఏసీ ఛైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, దళిత నాయకులు ఉల్లం రవి, పిల్లి భూలోకం ఉండి మొత్తం వ్యవహారాన్ని కలెక్టర్‌కు వివరించారు. బాధితురాలికి రక్షణ కల్పిస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మృతదేహం ఇవ్వడంలో వైద్యుల నిర్లక్ష్యం

● నిరసన వ్యక్తం చేసిన కుమార్తెలు

● అసాధారణ మరణమని వైద్యుల సమాచారం

● అనుమానాస్పద మృతిగా కేసు

● పోస్టుమార్టం తర్వాత మృతదేహం అప్పగింత


రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుమార్తెలు


మృతుడు రాంబాబు

రంపచోడవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తమ తండ్రి మృతదేహాన్ని అప్పగించడంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతుడి కుమార్తెలు శాంతి, దుర్గభవాని, బాపనమ్మ గురువారం ఆందోళన చేశారు. కాగా మృతుడి మరణం అసాధారణంగా ఉందని వైద్యుల సమాచారంతో మృతుడి పోలీసులు అనుమానాస్పద మృతిగా దర్యాప్తుచేపట్టారు. ఈ ఘటన పూర్వాపరాలు ఇలాఉన్నాయి. వై.రామవరం మండలం ఎర్రంరెడ్డి పాలేనికి చెందిన సుండం రాంబాబు(49) ఈనెల 19న రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో ఉంటున్న తన కుమార్తె కారంశాంతి ఇంటికి వచ్చారు. బుధవారం రాత్రి రాంబాబుమంచంపైన అకస్మాతుగా స్పృహతప్పి పడిపోవడంతో ఆటో రిక్షాలో అతన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాంబాబును పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను చనిపోయాడని తేల్చిచెప్పారు .కాగా మృతదేహాన్ని బంధువులకు తిరిగి అప్పగించకుండా అతడి మరణం అసాధారణంగా అనిపిస్తోందని రంపచోడవరం పోలీసులకు ఆసుపత్రి వైద్యులు సమాచారం అందించారు. దీంతో గురువారం మధ్యాహ్నం మృతుడి కుమార్తెలు శాంతి, దుర్గభవాని, బాపనమ్మ ఆసుపత్రి వైద్యులతీరుపై ఆసుపత్రి ఎదుటే ఆందోళనకు దిగారు. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో హుటాహుటిన పోలీసులు మృతుడికి శవపంచనామా నిర్వహించి వైద్యులకు నివేదిక ఇవ్వడంతో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వైద్యుల నుంచి వచ్చిన మృతుడి అసాధారణ మరణ సమాచార అనంతరం పోలీసులు మృతుడి కుమార్తె నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేశారు. ఫిర్యాదు సారాంశం ప్రకారం మృతు డు ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడని, ఆ కారణంగానే స్పృహతప్పి మరణించినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అయినప్పటికీ దర్యాప్తులో భాగంగా శవపంచనామా అన ంతరం పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై రంపచోడవరం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకట్రావు తదుపరి దర్యాప్తు సాగిస్తున్నారు. తమ తండ్రి మరణం అసాధారణం కాకపోయినప్పటికీ పోస్టుమార్టం లేకుండా ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ వైద్యుల తీరును ప్రశ్నించిన కారణంగానే తమను ఇబ్బంది పెట్టే ఉద్దేశంతోనే తమ తండ్రి మృతదేహాన్ని పోస్టుమార్టం వరకు తెచ్చారని మృతుడి కుమార్తెలు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వైద్యులు మాత్రం ఈ విషయంలో తామేమి నిర్లక్ష్యం వహించలేదని మృతుడిని ఆసుపత్రికి తీసుకువచ్చే సరికే మ రణించాడని మరణం అసాధారణం అనిపించి పోలీసులకు సమాచారం ఇచ్చామని అనంత రం పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించారని ఇందులో ఎక్కడా తమ జాప్యం లేదని పేర్కొన్నారు.

ఎవరు వీళ్లు? అయ్యో ఏం బాధొచ్చిందో?

● సమాచారం ఇవ్వాలని పోలీసుల విన్నపం


జీజీహెచ్ మార్చురీలో ఉన్న మృతదేహాలు

ఈ ఫొటోలో కనిపిస్తున్న మృతదేహాలను వన్‌టౌన్ పోలీసులు గురువారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. మార్కండేయ ఘాట్ సమీపంలో ఉన్న ఆహర ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్ద వరదనీరు వెనక్కు మళ్లుతోంది. ఆ నీటిలో ఒక పురుషుడు, ఒక మహిళ మృతదేహాలు తేలుతుండడాన్ని స్థానికులు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారి గుర్తింపునకు ఎలాంటి ఆధారాలూ లభించలేదని సీఐ మురళీకృష్ణ తెలిపారు. సమాచారం తెలిసిన వారు 9440796574 నెంబరుకు సమాచారం15 అందించాలని ఆయన కోరారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా మృతదేహాలను పరిశీలిస్తే ప్రాణాలు కోల్పోయి ఒక రోజు మాత్రమే అవుతున్నట్లుగా ఉంది. వయసు సారూప్యతను బట్టి భార్యాభర్తలనే అనుమానం కలుగుతోంది. జీవితంలో వేదనతో వీరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా లేక వేరే కారణం ఉందో పోలీసుల దర్యాప్తుల్లో తెలియాల్సి ఉంది.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

వ్యభిచార గృహంపై దాడి

● ముగ్గురు విటులు, నిర్వాహకురాలి అరెస్ట్

పెద్దాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సుధా కాలనీలో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐ విజయ్‌శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. ముగ్గురు విటులు, వ్యభిచార గృహ నిర్వాహకురాలితో పాటు ఆమె సహాయకుడిని అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ మౌనిక తెలిపారు. ఈ దాడుల్లో ఒక మహిళను కాపాడి రెస్క్యూ హోమ్‌కు తరలించినట్టు చెప్పారు.

ఇద్దరు హిజ్రాలపై బైండోవర్

తాళ్లరేవు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తాళ్లరేవు మండలంలోని సుంకరపాలెం బైపాస్ రోడ్డు నుంచి లచ్చిపాలెం ఆంజనేయస్వామి, పెట్రోలు బంకు వరకు ఉన్న హిజ్రాల స్థావరాలపై గురువారం కోరింగ ఎస్‌ఐ సత్యనారాయణ బృందం దాడి చేసింది. ఇద్దరు హిజ్రాలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తాళ్లరేవు తహసీల్దారు కోర్టులో హాజరుపరిచి బైండోవర్ కేసు నమోదు చేశారు.

మృతదేహం డోర్ డెలివరీ కేసు మళ్లీ విచారణ తీర్పును నిలిపివేయండి

● హైకోర్టులో అనంతబాబు పిటిషన్

● క్వాష్ పిటిషన్ కూడా దాఖలు

రాజమహేంద్రవరం, జూలై24(ఆంధ్రజ్యోతి): దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో మళ్లీ పూర్తిస్థాయి విచారణ చేయాలని రాజమండ్రి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును నిలిపివేయాలని కోరుతూ ఈ కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కరరావు అలి యాస్ అనంతబాబు గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం ఈకేసును ఎత్తివేయాలని కోరుతూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఆతీర్పు వచ్చేవరకూ రాజమండ్రి కోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేయాలని అందులో కోరారు. ఇది బహుశా శుక్రవారం లిస్ట్‌లో రావచ్చు. మరోప్రక్క ప్రముఖన్యాయవాది, హక్కుల ఉద్య మనేత ముప్పాళ్ల సుబ్బారావు ఈకేసు విషయం లో సిట్ అధికార్లకు, బాధితుల తరపున పలు సూచనలు చేశారు.

ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం
జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక రాజమహేంద్రవరంలో జరిగింది. గురువారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో 2025-27 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెవ్వూరి రవి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కేవీ రమణారావు, ప్రధాన కార్యదర్శిగా మంగిన శ్రీరామారావు, ఆర్థిక కార్యదర్శిగా పల్లిరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కోలా సత్యనారాయణ, జి.గణపతిరావు, కె.ఫణిశేఖర్, ఉపాధ్యక్షులుగా ఆర్.విజయదుర్గ, ఎం.చిమ్మరాజుదొర, జాయింట్ సెక్రటరీలు జేవీ శ్రీనివాస్, పి.వెంకటరెడ్డి, హెడ్ క్వార్టర్ సెక్రటరీగా ఎస్ఎల్‌వీ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎంవీఎం సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శిగా జి.ప్రమీలారాణి, సీహెచ్ సుబ్బలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ హెచ్ఎంలపై ఉన్నతాధికారులు పని ఒత్తిడి పెంచుతున్నారని, సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల 15 ఏళ్ల నుంచి ప్రధానోపాధ్యాయులు ప్రమోషన్ లేకుండా పదవి విరమణ చేస్తున్నారని సర్వీస్ రూల్స్ కల్పించి పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రధానోపాధ్యాయుడిపై ఫిర్యాదులు.. విచారణ

కడియం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుళ్ల నెంబర్-2 ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేసిన యార్లగడ్డ పాపారావుపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాలతో తిరుమలదాసు మాణిక్యం, కేఆర్ కిషోర్ గురువారం పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నిత్యం మద్యం తాగి విధులకు హాజరయ్యే వారని, సమయపాలన పాటించే వారు కాదని, పరీక్షలు, రికార్డులు సక్రమంగా నిర్వహించే వారు కాదని, తోటి ఉపాధ్యాయులను, గ్రామస్థులను, దుర్భాషలాడేవారని పలువురు తెలియజేశారు. దీనిపై నివేదిక తయారు చేసి జిల్లా విద్యాశాఖ అధికారికి అందిస్తామని అధికారులు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, నాయకులు ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, కంటిపూడి శ్రీను, గోపి ప్రసాద్, కులపాకల సత్తిబాబు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ వాయిదా

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న జరగాల్సిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో సభను వాయిదా వేస్తున్నానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ పగడాల సభకు ఇప్పటికి ఆరుసార్లు అనుమతి అడిగానని, అనుమతివ్వాలని కోర్టు చెప్పింది అయినా పోలీసులు ఇవ్వడంలేదని, అనుమతికి రకరకాల కారణాలు వెతుకుతున్నారని ధ్వజమెత్తారు. ప్రవీణ్ హత్య కేసులో పబ్లిక్ లిటిగేషన్ పిటీషన్ వేసేందుకు రూ.5లక్షల కట్టాలని తనను, కేఏ పాల్‌ను అడిగారని అయితే నేను ఇచ్చిన పిలుపుతో ప్రజలు స్పందించి ఇప్పటికి రూ.7,89,648 నగదును 78వేల మంది వేశారని, దానిని ప్రవీణ్ కేసుకు ఉపయోగిస్తామన్నారు. ఇకఎవ్వరు డబ్బులు పంపించవద్దని హర్ష సూచించారు. సంస్మరణ సభకు నిర్వహణపై కోర్టు సూచనలను ఉల్లంఘించిన జిల్లా పోలీస్ అధికారిపై తాను కంటెంప్ట్ ఆఫ్ కోర్టుకి వెళ్తున్నానని ఇక కోర్టులో తేల్చుకుంటానని హర్షకుమార్ చెప్పారు.

కాటన్ వర్ధంతి

కడియం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుళ్లలో ఆదర్శ రైతు సత్తి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం అపర భగీరథుడు కాటన్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తన ఇంటి వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రపు సత్యనారాయణ, సత్తి నాగిరెడ్డి, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, గోపి ప్రసాద్, దూడల సత్తిబాబు, బీరక రాజు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరంలో కాటన్ విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి జిల్లాలను సశ్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయుడని, ఇక్కడి ప్రజలకు ఆయన ప్రత్యక్ష దైవమని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, తాడి గంగిరెడ్డి తదితరులున్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింహారావు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): వర్షాభావం వల్ల వరి నాట్లు ఆలస్యమవుతున్నాయని ఈ నెలాఖరుకు నూరుశాతం పూర్తవుతాయని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా నరశింహరావు అన్నారు. రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం హుకుంపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాగు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువుల విత్తన శుద్ధి, ఎలుకల నివారణ, పంట మార్పిడి, డ్రోన్ వినియోగం తదితర పద్ధతుల్లో మెలకువలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయ రామలక్ష్మి మాట్లాడుతూ నేల పరీక్ష ఆధారిత పోషక యాజమాన్యం పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, ఏవోలు సూర్యరమేష్, కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

'అయ్యంకి' సేవలు చిరస్మరణీయం

రంగంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): అఖిల భారత గ్రంథాలయోద్యమానికి విశేష కృషి చేసిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ప్రజా గ్రంథాలయాలే ప్రజల విశ్వవిద్యాలయాలని చాటి చెప్పిన మహనీయుడు అయ్యంకి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎం.రామభద్రరావు, ఎన్‌వీ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆర్యాపురంలోని ఏబీ నాగేశ్వరరావు పార్కులో సీనియర్ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. దీనికి ప్రముఖ న్యాయవాది పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 1915లో గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను స్థాపించిగ్రంథాలయ ఉద్యమాన్ని వాడవాడలా విస్తరింపజేసిన సారథి అయ్యంకి వెంకటరమణయ్య అని అన్నారు. కార్యక్రమంలో మహంతి లక్ష్మణరావు, జామిశెట్టి అప్పాజీ, బండి నరేంద్ర,కాసాని శంకరరావు, జీవీ రమణ, పడాల అప్పారావు, ఆర్.వీరభద్రరావు తదితరులు వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

జిల్లాల పునర్విభజన ఆమోదం యోగ్యంగా జరగాలి

టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు

ధవళేశ్వరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన ప్రక్రియ ప్రజలకు ఆమోద యోగ్యంగా చేయాలని జిల్లాల పునర్విభజన ఉప సంఘానికి టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు లేఖ ద్వారా తెలిపారు. గతంలో లోక్‌సభ ప్రాతిపదికన జిల్లాల విభజన జరగడంతో జిల్లాకు మండలానికి, మండలానికి గ్రామానికి పొంతన లేని గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. గోదావరి నది తూర్పు భాగం తూర్పుగోదావరి జిల్లాగా, పడమర భాగం పశ్చిమగోదావరి జిల్లాగా ఉండేవని, అయితే నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలను తూర్పుగోదావరి జిల్లాలోను, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలను కోనసీమ జిల్లాలో కలపడం ప్రజలను గందరగోళానికి గురిచేసిందని, దీని వల్ల తమకు పక్కనే ఉన్న కలెక్టర్ కార్యాలయాన్ని వదిలి ఎక్కడో ఉన్న కలెక్టర్ కార్యాలయానికి పనులు కోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రస్తుత పునర్విభజన ప్రజలకు ఇబ్బంది లేకుండా చేపట్టాలని లేఖలో కోరారు.

భక్తులతో పోటెత్తిన
సాయిబాబా ఆలయాలు

కోరుకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుకొండ, బూరుగుపూడి, గాదరాడ గ్రామాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా షిర్డీ సాయికి ప్రత్యేక అర్చనలు, హారతులు, ఆరాధనలు నిర్వహించారు. బూరుగుపూడిలోని ద్వారకా షిర్డి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక భజనలు, పారాయణం జరిగింది. కోరుకొండ సాయిబాబా ఆలయం వద్ద, పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న బాబా ఆలయం వద్ద ప్రత్యేక అన్న సమారాధన కార్యక్రమాలు జరిగాయి. గాదరాడ గ్రామంలోని ఓం శివశక్తి పీఠంలోని సాయిబాబా ఆలయాన్ని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నన్నయ యూనివర్శిటీ విద్యార్థులు
28 మందికి ఉద్యోగాలు

దివాన్‌చెరువు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రసాయన విభాగం విద్యార్థులు 28 మంది ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. తన ఛాంబర్‌లో విద్యార్థులను గురువారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్నయ వర్శిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల రసాయన విభాగం నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 18 మంది, ఎనలిటికల్ కెమిస్ట్రీ నుంచి 10 మంది ఉద్యోగాలు సాధించారన్నారు.

గోకవరంలో వైద్య శిబిరం

గోకవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని సీఎండీ లేఅవుట్ ప్రాంగణంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన సన్‌స్టార్ ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తున్నాం

ప్రభుత్వ బోధనాసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇది ఆరంభం మాత్రమే, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)ని ఆయన సందర్శించారు. ఓపీ విభాగంతోపాటు పలు వార్డులకు వెళ్లి రోగులతో మాట్లాడారు. వైద్యసేవలపై రోగులను, వారి సహాయకులను ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకం పెంచడానికి గత ఏడాది కాలంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, అవుట్ పేషెంట్ రోగుల సంఖ్య గణనీయంగా పెరగడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతోపాటు ఆసుపత్రి అధికారులు, డాక్టర్ల కృషి వల్లే ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే అన్నారు. ఎస్ఎన్‌సీయూ, డెర్మటాలజీ విభాగాల్లో 100 పడకలు సిద్ధం చేశామని, ఎమర్జన్సీ వైద్యసేవల విభాగాన్ని పటిష్టం చేయడంతోపాటు విధుల్లో ఉన్న వైద్యులు, నర్సింగ్, ఇతర స్టాఫ్‌పై దౌర్జన్యాలకు పాల్పడుతున్న అల్లరిమూకలపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరతామని అన్నారు. జీజీహెచ్‌తోపాటు అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ వైద్యసేవలు, సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని అన్నారు. లోటుపాట్లు లేవని తాను చెప్పడంలేదని, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళతామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెన్నడీ, ఆర్ఎంవో డాక్టర్ సుబ్బారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెంపుల్ టూరిజంగా బిక్కవోలు, జి.మామిడాడ

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



టూరిజం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రసాదం పథకంలో భాగంగా బిక్కవోలు, గొల్లల మామిడాడలోని ప్రాచీన ఆలయాలను కలిపి టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఏపీ టూరిజం ఈఈ కె.విజయభాస్కర రెడ్డితో కలసి బిక్కవోలు లక్ష్మీగణపతిని దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిక్కవోలులోని లక్ష్మీగణపతి, గోలింగేశ్వరస్వామి, గొల్లల మామిడాడలోని సూర్యనారాయణమూర్తి, రామాలయాలను టూరిజం ద్వారా అభివృద్ధి చేసేందుకు తాను, ఎంపీ పురందేశ్వరి కలసి కేంద్ర టెంపుల్ టూరిజం శాఖామంత్రి షెకావత్‌కు లేఖ ఇచ్చామని దీంతో కేంద్ర టూరిజం ఆదేశాలతో రాష్ట్ర టూరిజం ఈఈ వచ్చారన్నారు. కాగా కెనాల్ రోడ్డులోని జోడినాదాల తూము వద్ద వంతెన నిర్మించి అక్కడ నుంచి చదరంగం పుంత మీదుగా ఆలయం వరకూ ఆపై ఆలయం నుంచి గొల్లల మామిడాడ వరకూ బైపాస్ రోడ్డు నిర్మించాలని టూరిజం శాఖకు తెలిపామని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. అలాగే బిక్కవోలులో భక్తులు కోసం కాటేజీలు నిర్మించేందుకు ఆ శాఖ కృషి చేస్తోందన్నారు. ఈఈ విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ బిక్కవోలుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి త్వరలోనే కేంద్రానికి పంపుతానన్నారు. ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, బేరా వేణమ్మ, ఇందల వీరబాబు, ఓవీ. కృష్ణ, సింగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

అనపర్తి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న పనులపై ఆరా తీశారు. గ్రామాల్లో అవసరమైన చోట రోడ్లు, డ్రైన్లు, తాగు నీటి సౌకర్యం వంటి అంశాలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ అచ్యుతరామారెడ్డి, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అనపర్తిలో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు ప్రారంభం నుంచి ఉన్నతాధికారులు శ్రద్ధ వహించకపోవడం వల్లే నాణ్యత లోపించిందన్నారు. నాణ్యత విషయంలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదంటూ అధికారులను హెచ్చరించారు.

గడ్డి మందు తాగి వ్యక్తిమృతి

రాజానగరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు ఆరోగ్య సమస్యలతో సతమవుతున్న ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో పాతతుంగపాడు గ్రామానికి చెందిన బోయిడి సత్యనారాయణ(49) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో మానసికంగా బాధపడుతున్నాడు. దీనికి తోడు కుమారుడు ప్రమాదానికి గురై కాలు, చెయ్యి విరిగిపోవడంతో కొంతకాలంగా మంచానికే పరిమితం కావడంతో యజమాని సత్యనారాయణ మనోవేదనకు లోనయ్యాడు. దీంతో ఈ నెల 23న పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు ఏఎస్ఐ వీర్రాజు కేసు నమోదు చేశారు.

పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

రాజానగరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పొలంలో అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, దానిలోని కాపర్ వైర్‌ను దొంగిలించారు. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలో పల్లకడియంలో ఈదర సూరిబాబు అనే రైతు గ్రామంలో మామిడి, జీడిమామిడి పండ్ల తోటల్లో కౌలు వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 17న పొలానికి వెళ్లి తోటకు నీరు పెట్టాడు. మర్నాడు 18న ఉదయం పొలానికి వెళ్లి చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై ఉండం గమనించాడు. దీంతో పరిశీలించి చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, దానిలోని విలువైన కాపర్ వైర్లు దొంగిలించినట్టు గుర్తించాడు. దీంతో అతడు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్.ఐ నాగార్జున కేసు నమోదు చేశారు.

స్థిర విధానాలతో
వనరుల సద్వినియోగం

రాజానగరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూమండలంలో వనరులు పరిమితంగా ఉన్నాయని, వాటి వినియోగంలో స్థిరమైన విధానాలను పాటించాలని గైట్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్ సూచించారు. జీజీయూ ప్రాంగణంలోని అటానమస్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పరిమిత గ్రహం, పరిమిత వినియోగాన్ని పొందుదాం అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణానికి ఎటువంటి హాని లేకుండా వనరుల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడంతోపాటు పునర్వినియోగం చేయడం వంటి పద్ధతులను అవలంబించాలని సూచించారు. వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆలిండియా చెస్, క్యారమ్స్ టోర్నీకి 16 మంది ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సూర్యగార్డెన్స్‌లో జరుగుతున్న ఎల్ఐసీ సౌత్‌సెంట్రల్ జోన్ క్యారమ్స్, చెస్ పోటీల్లో 16 మంది క్రీడాకారులు ఆలిండియా స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు గురువారం సాయంత్రం ముగిసాయి. విజేతలకు ఎల్ఐసీ డివిజనల్ మేనేజరు సత్యనారాయణ సాహూ బహుమతులు ప్రదానం చేశారు. ఎల్ఐసీ మేనేజరు (పీ అండ్ఐఆర్) ఎం.పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ సభ్యులు సురేష్, డీవీఎస్వీ శర్మ సౌత్ జోన్ కార్యాలయం నుంచి పరిశీలకులుగా హాజరయ్యారు. క్యారమ్ రిఫరీగా షేక్ అబ్దుల్ జలీల్, చెస్ ఆర్బిట్‌గా జీవీ కుమార్ వ్యవహరించారు. రెండింటిలోనూ సౌత్ సెంట్రల్ జోనల్ పరుషుల, మహిళల జట్లు ఈ టోర్నమెంట్‌లో ఎంపికయ్యాయి. జాతీయ పోటీలకు చెస్‌లో రేణుకకుమారి(హైదరాబాద్), సీహెచ్ రాధిక దేవి(మచిలీపట్నం), ఎంఎస్ నాగరత్నం (మైసూర్), వీణకాంత్(బెంగుళూరు), ఆర్.శ్రీధర్ (నెల్లూరు), ఆర్.కృష్ణారెడ్డి (బెల్గాం), ఆర్.జయదేవ్(హైదరాబాద్), పి.కృష్ణప్రసాద్(హైదరాబాద్) ఎంపికయ్యారు.క్యారమ్స్‌లో ఎస్.అపూర్వ(హైదరాబాద్), పి.నిర్మల(హైదారాబాద్), ఆనాల దేవి(బెంగుళూరు), కె.జయశ్రీ(హైదరాబాద్), డీఎస్ శివదాస్(బెంగళూరు), బి.అజయ్‌కుమార్(సికింద్రాబాద్), బీఎస్ ప్రసాద్ (మైసూర్), ఎంఏ సలాం (కడప) ఎంపికయ్యారు.

నేడు మహిళల జిల్లా స్థాయి
చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న స్థానిక అనుశ్రీ థియేటర్ సమీపంలోని ది అల్యూమ్ని హాల్లో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 26,27 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన మహిళా క్రీడాకారులు ముందుగా www.apchess.org వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 98483 74133 నెంబర్‌ను సంప్రదించాలని కుమార్ తెలిపారు.

వీరవరంలో చౌడేశ్వరిదేవికి జలాభిషేకం

కడియం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆషాఢ అమావాస్య సందర్భంగా వీరవరంలో లక్ష్మీగణపతినందీశ్వర చౌడేశ్వరి, జ్ఞానసరస్వతి ఆలయంలో గురువారం విశిష్ట పూజలు నిర్వహించారు. 108 మంది ముత్తైదువులతో కలశాల ప్రదర్శన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక జాంపేట ఉమా రామలింగేశ్వర కల్యాణ మండపంలో కల్యాణ మండపం, రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరీదేవి జయంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆషాఢం సారె, చీరలు సమర్పించారు. సారెను దేవాంగ మహిళలు పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పాల్గొని తెలిపారు. కార్యక్రమంలో రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రొబ్బి విజయశేఖర్, కాలెపు సత్యనారాయణమూర్తి, చింతా వెంకట చలపతిరావు, బీరా శ్యామలరావు, బళ్లా సత్యనారాయణ, ద్వారా పార్వతీ సుందరి, అల్లాడ శ్యామలదేవి పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్.. అన్న క్యాంటీన్ తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో అందించే ఆహారం శుచి శుభ్రత అదించడం ప్రధానమని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్ సూచించారు. గురువారం ఆయన స్థానిక సుబ్రహ్మణ్య మైదానం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంటీన్‌లోను, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సమయ పాలన అత్యంత ముఖ్యమని సిబ్బందికి సూచించారు. క్యాంటీన్‌లో ఆహారం, పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. భోజన వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేసేలా నిర్వహకులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఆర్‌బీఐ ఆర్డీ



ఆర్‌బీఐ ఆర్డీ బషీర్‌కు మొక్క అందజేస్తున్న నర్సరీ రైతు

కడియం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని గురువారం ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ ఏఓ బషీర్ సందర్శించారు. నర్సరీ రైతు పెదసత్యనారాయణ ఆయనకు మొక్కను అందజేసి స్వాగతించారు.నర్సరీని ఆర్‌బీఐ బృందంతో కలిసి బషీర్ చూసిన పలు రకాల మొక్కల గురించి వివరించారు.మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ మార్గమని,ప్రకృతిని కాపాడడం మానవ ధర్మమని బషీర్ అన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సహకార సంస్థలు ప్రజలకు అత్యంత దగ్గరగా పనిచేసే శక్తి వంతమైన సంస్థలని, సమాచారం హక్కుచట్టం(2005) అమలులో సహకార శాఖ ఉద్యోగులు కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. బుధవారం ఆర్యాపురం అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ సమావేశ మందిరంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కుచట్టం-2005పై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటరమణ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005కి చెందిన దరఖాస్తుల స్వీకరణ (సెక్షన్6) లోబడి వుంటుందన్నారు. సమయానికి సమాధానం ఇవ్వాల్సిన గడువు (సెక్షన్7), అప్పీల్ ప్రక్రియ (సెక్షన్ 19) తదితర అంశాలపై ప్రజా సమాచార అధికారులు(పీఎల్‌వోలు) పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విభాగ సహకార అధికారి ఎం.కనకదుర్గారెడ్డి, రామ్‌దాస్ సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడారు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 20 ప్రకారం సమాచారం ఆలస్యమైతే రోజుకు రూ.250 చొప్పున గరిష్టంగా రూ.25 వేలు వరకు జరిమాన విధించవచ్చని వెంకటరమణ పేర్కొన్నారు.

టీబీ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ

రాజానగరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పీహెచ్‌సీ పరిధిలో వైద్య సేవలు పొందుతున్న టీబీ రోగులకు గ్రాసిమ్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్ తెలిపారు. 16 మంది టీబీ బాధితులను కంపెనీ దత్తత తీసుకుందని, వారందరికి పోషకాహార కిట్లు అందజేశారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.లక్ష్మి, గ్రాసిం హెచ్ఆర్ కేజియా తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ ప్రభుత్వాసుపత్రి వద్ద టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ మిత్రగా అనపర్తి గ్రాసిమ్ ఇండస్ట్రీ ప్రతినిధులు జె.జీయర్ సుందర్, కేజియాలు టీబీ బాధితులకు న్యూట్రీషియన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్ఞానచంద్ర మాట్లాడుతూ టీబీ బాధితులు పూర్తికాలం చికిత్సతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మధుమేహం ఉన్న వారు, 60 ఏళ్లు దాటిన వారు, మద్యం, ధూమపానం అలవాటు ఉన్న వారు, పరిశ్రమల్లో పనిచేసే వారు, వృద్ధాశ్రమాల్లో ఉండేవారు కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వై.ఉమాపార్వతీశం, సూపర్‌వైజర్ శ్రీనివాసు, శేషు, మహేష్ బాబు, అమృత, రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసు, రాజు, నరసింహ, పద్మ పాల్గొన్నారు.

మ్యారేజ్ లైసెన్స్ పరిమితి పెంపుపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ క్రిస్టియన్ మ్యారేజ్ లైసెన్స్ హోల్డర్లకు ప్రభుత్వం పదేళ్లపాటు రెన్యువల్‌కు అవకాశం ఇవ్వడం పట్ల ఇంటర్నేషనల్ క్రిస్టియన్ అంబాసిడర్ ఆఫ్ ఏపీ జనరల్ బాడీ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. గురువారం స్థానిక లాలాచెరువు జాతీయ రహదారిలో ఉన్న శాంతి నిలయం చర్చ్‌లో సంఘం అధ్యక్షుడు బిషప్ పొన్నమాటి బాబ్జి ఆధ్వర్యంలో పి.సుందరరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. క్రైస్తవులకు, పాస్టర్లకు సంక్షేమ పథకాలు విదేశీ విద్య, జెరుసలేం యాత్ర, ఉపాధి హామీ పథకాలు, ఇండియన్ క్రిస్టియన్ మ్యారేజీ లైసెన్స్ హోల్డర్లకు చంద్రబాబు ప్రభుత్వం పదేళ్లకు పొడిగించడం హర్షణీయమన్నారు. సమావేశంలో పాస్టర్లు డాక్టర్ డేనియల్ విల్సన్, నక్కా ఆనంద్‌కుమార్, కె.శాంతారావు, పి.రాజేంద్రప్రసాద్, ఆర్థర్ ప్రసాద్, గొట్టిముక్కల శాంసన్ రాజు, 26 జిల్లాల గవర్నింగ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

దొడ్డిగుంటలో తొలి అడుగు

రంగంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు గురువారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది కాలంలో గ్రామంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, నాయకులు ఉద్దండ్రావు శ్రీను, కొమ్మన రాంబాబు, పూసల శ్రీను, అడబాల వెంకట్రావు, వెలమర్తి సుధాకర్, దూళ్ల ధర్మరాజు పాల్గొన్నారు.

పందలపాక హైస్కూల్‌ను సందర్శించిన
డీఈవో వాసుదేవరావు

బిక్కవోలు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలను గురువారం డీఈవో కె.వాసుదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏవిధంగా ముందుకు వెళ్లాలో విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు డీఈవో వెంట వున్నారు.

పేదల జీవితాల్లో
పీ4తో వెలుగులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే పీ4 కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. స్థానిక 42వ డివిజన్‌లో పీ4పై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అధ్వానంగా మారిందని, ఆర్థికంగా దివాళ తీసే పరిస్థితికి తీసుకెళ్లారున్నారు. అలాంటి తరుణంలో అధికారం చేపట్టిన చంద్రబాబు పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి పీ4 అమలుచేస్తున్నారన్నారు. సమావేశంలో కూటమి నాయకులు ఉప్పులూరి జానకీరామయ్య, మళ్ల వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పాడలో సముద్రంలో అలల కల్లోలం.. రాజమహేంద్రవరంలో వాన దృశ్యాలు

వానేవాన!

- అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాలు
- రెండు రోజుల్లో మరింతగా బలపడి తీవ్ర అల్పపీడనంగా మార్పు
- ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలతో గోదావరికి పెరగనున్న ఇన్‌ఫ్లో
- సముద్రం అల్లకల్లోలంతో కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులకు బ్రేక్
- ఆఫ్రికాకు వెళ్లాల్సిన ఆరు షిప్‌ల్లో నిలిచిన లోడింగ్
- ఉప్పాడతోపాటు కోనసీమలో తీరం వెంబడి ఎగసిపడుతున్న అలలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం రోజంతా ముసురేసింది. అక్కడక్కడ భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అయితే ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం బలపడి రెండు రోజుల్లో తీవ్ర అల్పపీడనంగా మారనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్నట్టు వెల్లడించింది. మరోపక్క ఒడిషా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లోను భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గోదావరిలోకి ఇన్‌ఫ్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోపక్క అల్పపీడనం ప్రభావంతో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో తీరం అల్లకల్లోలంగా మారింది. ఉప్పాడ, అల్లవరం, అంతర్వేది వద్ద అలల ఉధృతి భారీగా పెరిగింది. రాకాసి అలలు అంతెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ వద్ద అయితే సముద్రం ముందుకు రావడంతో మత్స్యకార గ్రామాల్లోకి రెండో రోజు కూడా నీరు చేరింది. అయితే తీవ్ర అల్పపీడనంగా ముదిరితే కెరటాల తీవ్రత మరింత పెరగనుంది. మరోపక్క సముద్రంలోపల ఈదురు గాలులు అధికంగా ఉండడంతో కెరటాల ఉధృతి అధికంగా ఉంది. అటు కాకినాడలో రోజంతా వాన కురవడంతో పోర్టులో బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఆఫ్రికా దేశానికి బియ్యం ఎగుమతి చేయడానికి ఆరు నౌకలు కొన్ని రోజుల కిందట పోర్టుకు వచ్చాయి. అయితే అలల తీవ్రత, వర్షం కారణంగా బియ్యం లోడింగ్ ఆగిపోయింది. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇదిలాఉంటే అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. కాకినాడ జిల్లా రౌతులపూడిలో అత్యధికంగా 2.8సెంటీమీటర్లు, శంఖవరం 2, కాకినాడ రూరల్ 1.7, పెద్దాపురం 1.2 సెంటీమీటర్లు కురవగా, మిగిలిన అన్ని మండలాల్లో మి.మి.లో వర్షపాతం నమోదైంది. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 1.2 సెంటీమీటర్లు, రాజోలు 1.1, మండపేట 1.1, తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో 1.1 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురవగా, మిగిలిన అన్ని మండలాల్లో మి.మి. చొప్పున వర్షం కురిసింది. అటు ముసురు వాతావరణంతో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి చలివాతావరణం కొనసాగింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై24(ఆంధ్రజ్యోతి): వాతావరణశాఖ హెచ్చరికలు, అధిక వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆమె ఒక ప్రకటన జారీచేశారు. ఈనెల 28వ తేదీ వరకూ జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 25న ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. లోతట్టు ప్రాంతాలు, పాత భవనాలు, నదీ తీర ప్రాంతాల వద్ద నివసించే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం జిల్లాలో 114.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని చెప్పారు. కోరుకొండ మండలంలో అత్యధికంగా 18.4, నిడదవోలులో 18.2, తాళ్లపూడి 18, రాజానగరంలో 15.4, సీతానగరంలో 15, నల్లజర్లలో 10.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని ఆమె తెలిపారు.



532 బస్సులు సిద్ధం

రాజమహేంద్రవరం డిపోలో బస్సులకు మరమ్మతులు

ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాల్సిందేనని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో.. బస్సులను సమకూర్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 532 బస్సులు నిర్దేశిత సమయాని కంటే ముందుగానే సిద్ధంచేసి ట్రయల్ రన్ వేయాలని ఆలోచన చేస్తున్నారు. తూర్పుగోదావరిలో 285 బస్సులు ఉండగా 165 పల్లె వెలుగు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 291కి 191, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 300కి 176 పల్లెవెలుగులు ఉన్నాయి. వీటిలో 532 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగులు మహిళలకు సేవలు అందించనున్నాయి.

మహిళల ఉచిత బస్సులకు తుది మెరుగులు

- వచ్చే నెల 15 ముహూర్తం
- ఆయా డిపోల్లో చురుగ్గా పనులు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 532 బస్సులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. కుషన్ సీట్లు, హ్యాంగర్లు వంటివి ఏర్పాటుచేసి రంగులు వేస్తున్నారు. ప్రయాణం సౌకర్యవంతంగా ఉండే విధంగా బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరిలోని రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు, కాకినాడ, తుని, ఏలేశ్వరం, అమలాపురం, రాజోలు, రామచంద్రాపురం, రావులపాలెం డిపోల్లోని మహిళల ప్రయాణం కోసం ఉద్దేశించిన బస్సులను పూర్తిగా పరీక్షించి ఆ మేరకు మరమ్మతులు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన తర్వాత బస్సుల సీటింగ్ కెపాసిటీకి మించి రద్దీగా ప్రయాణికులు ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి ఇబ్బందీ కలగకూడదని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. దీంతో బస్సు బయలుదేరిన తర్వాత బ్రేక్‌డౌన్, బస్సు సాంకేతిక లోపాలతో రద్దుకావడం, కిటికీలు తదితర శబ్దాలు రాకుండా ఉండడం, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇబ్బందులు రాకుండా ఉండడంతోపాటు సౌకర్యవంతంగా ప్రయాణం సాగడం కోసం అవసరమైన అన్ని మరమ్మతు పనులూ చేస్తున్నారు. కొన్ని డిపోలకు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులు కొత్తగా ఇచ్చారు. దీంతో బాగా పాతబడిన వాటి బాడీలను పల్లె వెలుగులతో మార్పు చేస్తున్నారు.



నవోదయానికి రాజకీయ గ్రహణం

- సారా వ్యక్తులను పట్టుకుంటే తీవ్ర ఒత్తిడి
- అయినా ఆగని అరెస్ట్‌లు... 68 మంది వరకూ జైలులో
- 750 వరకూ కేసులు నమోదు
- జిల్లాలో 230 గ్రామాల్లో నాటు సారా
- 136 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటన
- సెప్టెంబరు చివరికి సారా రహిత జిల్లాగా లక్ష్యం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సారా రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నవోదయం-2కు జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు అడ్డుపడుతుండడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వం సెప్టెంబరు నెల చివరికి మొత్తం రాష్ట్రంతోపాటు జిల్లాను కూడా సారా రహిత జిల్లాగా ప్రకటించాలనే లక్ష్యంతో నవోదయం-2ను అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో ఎక్కడా సారా తయారుచేయడం, అమ్మడం, రవాణా చేయడం, తాగడం వంటివి ఏమీ ఉండకూడదు. ఈనేపథ్యంలో చాలాకాలం నుంచి ఇదే జీవనాధారంగా కొందరు బతకడాన్ని గుర్తించిన ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కూడా చూపించనుండడం తెలిసిందే. ఈ పథకాన్ని అమలుచేయడం కోసం ఎక్సైజ్‌తోపాటు స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూడా ఇక్కడ పని చేస్తున్నారు. జిల్లాలో 230 గ్రామాల్లో సారా తయారీ, రవాణా, అమ్మడం, తాగడం వంటి కార్యకలాపాలను గుర్తించి, అక్కడ విస్తృతంగా ప్రచారం మొదలుపెట్టారు. ఇప్పటికే 136 గ్రామాల్లో పూర్తిగా అరికట్టినట్టు అధికారులు చెబుతున్నారు. మిగతా గ్రామాల్లో ఆగస్టు నెలాఖరుకి పూర్తిచేసి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తే సెప్టెంబరులో మొత్తం రాష్ట్రాన్ని సారా రహిత రాష్ట్రంగా ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికార్ల మీద తీవ్ర ఒత్తిడి ఉంది. ఎవరినీ వదలవద్దని, ముందు వార్నింగ్ ఇవ్వాలని, అవగాహన చేయాలని, వినకపోతే అరెస్ట్‌లు, రిమాండ్‌లు తప్పవని కూడా ఉన్నతాధికార్ల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. దీంతో జిల్లాలో అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోనూ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటివరకూ జిల్లావ్యాప్తంగా 750కు పైగా కేసులు నమోదు చేసి 68 మందిని రిమాండ్‌తో సెంట్రల్ జైలుకు పంపారు. రెండు మూడు రోజుల్లోనే 28 మందిని సెంట్రల్ జైలుకు పంపడం గమనార్హం. ఇప్పటికే ఒక మహిళపై పీడీ యాక్ట్ పెట్టారు. మరో ఇద్దరిపై ప్రతిపాదనలు చేశారు. అవి అధికార్ల పరిశీలనలో ఉన్నాయి.

● రాజకీయ ఒత్తిళ్లు..

ముఖ్యమైన సారా తయారీదార్లపై కేసులు పెట్టినా, అరెస్ట్ చేసినా రాజకీయ నేతల నుంచి అధికార్లకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఈసారికి వదిలేయమని చెబుతుండడం గమనార్హం. ఇటీవల ఒక గ్రామానికి చెందిన సారా వ్యాపారిని రెండుసార్లు అరెస్ట్ చేస్తే, తనకు కిడ్నీ ప్రాబ్లెమ్ ఉందని, బెయిల్ ఇస్తే ఇక మానేస్తానని చెప్పడంతో బెయిల్ ఇచ్చారు. కానీ అతను మళ్లీ మొదలు పెట్టడంతో ఇటీవల అరెస్ట్ చేశారు. అతనిని వదిలేయమని స్వయంగా ఓ నేత ఫోన్ చేసి చెప్పడం గమనార్హం. అయినా అధికారులు వదలలేదు. మరో సారా తయారీదారు అరెస్ట్ విషయంలో ఏకంగా ఎక్సైజ్ మంత్రి పేషీ వరకూ వెళ్లడం గమనార్హం. అక్కడ నుంచి ఆరా తీయగా, అతని మీద ఉన్న కేసులు గురించి వివరించడంతో ఎవరూ మాట్లాడలేదు. ఇటీవల మల్లయ్యపేటలో ఒక మహిళను అరెస్ట్ చేసి ఆరా తీయడంతో వెంకటనగర్‌కు చెందిన వ్యక్తి సారా అమ్ముతున్నట్టు చెప్పడంతో అక్కడకు వెళ్లి, ఆరా తీయడంతోపాటు ఇక మోటారు సైకిల్‌ను నార్త్ స్టేషన్ పోలీసులు తీసుకుని రావడం గమనార్హం. దీంతో ఆ ప్రాంతం నుంచి కొంతమంది మూకుమ్మడిగా నార్త్ ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి, రుబాబు చేశారు. అంతేకాక స్టేట్ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన పూర్ణచందర్ అనే కానిస్టేబుల్‌పై చెయ్యి చేసుకున్నారు. దీనిని ప్రభుత్వమూ, ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని, దాడి చేసిన వారిపై త్రీటౌన్‌లో కేసు నమోదు చేశారు. ఇక్కడ రాజకీయ నేతలకు స్థానిక ఎక్సైజ్ సిబ్బంది కూడా అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, సారా తయారీదారులు, వ్యాపారులకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

● నార్త్, సౌత్ స్టేషన్ల సిబ్బంది మార్పు

స్టేట్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌పై వెంకటనగరం సారా వ్యాపారులు దాడి చేసిన సమయంలో స్థానిక ఎక్సైజ్ సిబ్బంది అడ్డుకోలేదని, అంతేకాక నవోదయం-2 అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారని చెబుతూ నార్త్, సౌత్ ఎక్సైజ్ స్టేషన్ల మొత్తం అధికారులు, సిబ్బందిని మార్చేశారు. ఈమేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఇక్కడి సిబ్బంది పని తీరు మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వైఖరి మార్చుకోలేదని ఆయన తెలిపారు. నవోదయం-2ని పగడ్బందీగా అమలు చేయవలసిందేనని ఆదేశించారు. దీంతో సౌత్ స్టేషన్‌లో సీఐ, ఎస్‌తోపాటు మొత్తం 12 మందిని, నార్త్‌స్టేషన్‌లో ఆరుగురిని వేరే చోటకు అటాచ్‌మెంట్ ఇచ్చారు. కానీ నార్త్ స్టేషన్‌లో జరిగిన సంఘటన వల్ల సౌత్ స్టేషన్ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవడం పలు చర్చనీయాంశమైంది. సాధారణంగా కొందరు కింది స్థాయి సిబ్బంది సారా తయారీదార్లకు, వ్యాపారులకు అండగా ఉంటారు. గతంలో నెలవారీ మామూళ్లకు ఒప్పందం కుదిరింది. ఇటీవల చాలా మెరుగైంది. జిల్లాలోని అన్ని స్టేషన్ల కంటే సౌత్ స్టేషన్‌లో రిస్క్ ఎక్కువ. దీని పరిధిలోని రూరల్, రాజానగరం, కడియం మండలాలు ఉన్నాయి. సారా క్రైమ్ ఎక్కువగా రాజానగరం, రూరల్ ప్రాంతాల్లోనే అధికం. ఒత్తిళ్లు కూడా ఎక్కువ. ఇకనైనా రాజకీయనేతలు ఒత్తిడి చేయకుండా ఉంటే ఎక్సైజ్ సిబ్బందీ తప్పుచేయడానికి భయపడతారు.

జిల్లాలో ఎంఎస్‌ఎంఈ బలోపేతానికి ర్యాంప్ పథకం

ఉద్యోగావకాశాలు- స్థానిక పరిశ్రమల అభివృద్ధికి కార్యాచరణ : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఎస్ఎంఈ బలోపేతానికి ర్యాంప్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన వార్షిక లక్ష్యాల మేరకు కార్యాచరణ అమలుచేస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం అమలుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుని నోడల్ అధికారిగా నియమించారని తెలిపారు. ఎంఎస్ఎంఈలకు బలోపేతం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం ఉద్యమ్ నమోదు, నైపుణ్యాభివృద్ధి, స్వంత ఆవిష్కరణలు, కొత్త వ్యాపార ఆలోచనలు, బ్రాండ్ పేర్లు, లోగోలు తదితర విషయాలను రిజిస్టర్ చేసుకుని హక్కులుగా పొందేవిధంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. 2025 జూలై- సెప్టెంబరు వరకు వీటికి సంబంధించి కార్యశాల నిర్వహిస్తామని తెలిపారు.

జాయింట్ పట్టాదారులు విభజనకు మరో అవకాశం

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు, తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకొనేందుకు 2025 డిసెంబరు 31 వరకు అవకాశం కల్పించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో బాగంగా విభజన కోసం సాధారణంగా వసూలు చేసే రూ.500 ప్రభుత్వ రుసుం పూర్తిగా మాఫీ చేశామన్నారు. భూయజమానులు కేవలం రూ.50 నామమాత్రపు రుసుం గ్రామ సచివాలయంలో చెల్లించి డిసెంబరు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక అవకాశం ద్వారా జాయింట్ పట్టాదారులు తమ భూములను విడిగా నమోదు చేసుకొని అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత పొందవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఇబ్బంది పడుతున్న రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే వారికి తొలి ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం కల్పిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో నేడు స్పాట్ అడ్మిషన్లు

ధవళేశ్వరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరానికి ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో సీటు కోసం దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయిన అభ్యర్థులు ఈనెల 23న నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీటు పొందలేకపోయినా, కౌన్సెలింగ్‌కు హాజరై కాలేకపోయినా అటువంటి వారికి మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఈనెల 25న స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు శుక్రవారం నాడు హాజరుకావాలని ఆయన కోరారు.



పాలిథీన్.. కవర్రీ!

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్
- డబుల్ అయోమయం
- జిల్లా కేంద్రానికే నిషేధం పరిమితం
- జరిమానాలతో చిరు వ్యాపారుల గగ్గోలు
- హోల్‌సేలర్లకు మాత్రం కేవలం వార్నింగే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంకల్పం మంచిదే అయినా తగిన కసరత్తు లేకుండా అమల్లోకి దిగితే సమస్యలు తప్పకపోవచ్చు. సింగిల్ యూజ్ (ఒకసారి మాత్రమే వాడాల్సిన) ప్లాస్టిక్, పాలిథీన్ కవర్ల నిషేధం జిల్లా ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. ముందుగా తగిన విధంగా కసరత్తు లేకుండా ఒక్క ఉదుటున నిషేధం మొదలుపెట్టారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచీ చేతితో సంచి బయటకు తీసుకెళ్లడం అలవాటు లేని జనం ఒక్కసారిగా ఇబ్బందిపడుతున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న పాలిథీన్ కవర్లు కనిపిస్తే జరిమానాలు విధిస్తామని యంత్రాంగం హెచ్చరిస్తుండగా.. వస్త్ర, నార, కాగితం సంచుల వంటి ప్రత్యామ్నాయాలను విరివిగా అందుబాటులోకి తీసుకురాకుండా నేరుగా చర్యలకు దిగడం సబబేనా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. చిరు వ్యాపారులకు పెద్ద జరిమానాలు విధిస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. నిబంధనల ప్రకారం వాడాల్సిన సరుకు అందుబాటులో లేదు. సంచి ఇవ్వకపోతే బేరం పోతోంది. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న చందంగా తమ పరిస్థితి తయారైందని చిన్న దుకాణదారులు ఆవేదన చెందున్నారు. పెద్ద దుకాణదారులపై మాత్రం దయ చూపిస్తూ హెచ్చరించి వదిలేస్తుండడంపై విమర్శలు వినవస్తున్నాయి.

● వారికి వార్నింగేనట


రాజమహేంద్రవరంలోని సైకిళ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వారితోపాటు రోడ్డు పక్కన చిన్న హోటళ్లు, కూరగాయల దుకాణదారులు, కిరాణా షాపుల చిరు వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ క్షణంలో ఎవరు వచ్చి ఫైన్ వేస్తారో తెలియని పరిస్థితి ఉంది. పాలిథీన్ కవరు హోల్‌సేల్‌గా ఒక్కోటి 50పైసలకంటే తక్కువే పడుతుంది. అందువల్ల దుకాణదారులకు వాటిని వినియోగదారులకు ఇవ్వడానికి పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు వాటిని నిషేధించడంతో వస్త్ర, నార, కాగితంతో చేసిన వాటిని ఇవ్వాలంటే ఒక్కోటి కనీసం రూ.3పైనే ఉంటుంది. కాబట్టి దుకాణదారులు వెచ్చించలేకపోతున్నారు. అలాగని కవరు ఇవ్వడం ఆపేసి.. చేతిలో పొట్లం పెడితే జనం అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. అందువల్ల చాటుమాటుగా కవర్లు దాచుకొని ఇస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 900 మంది సచివాలయ కార్యదర్శులను, 25 శానిటరీ సర్కిళ్లలోని శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలు, వర్కర్లు సుమారు 1800 మంది ప్రతి రోజూ జల్లెడ పడుతున్నారు. నిబంధన అతిక్రమిస్తే రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకూ ఫైన్ విధిస్తున్నారు. గత ఏడాది జనవరి నుంచీ ఇప్పటివరకూ ప్లాస్టిక్ నిషేధం ఉల్లంఘించిన వారిపై రూ.10 లక్షలకు పైగా జరిమానాలు విధించారు. ఇప్పుడు ఆ తీవ్రతను పెంచారు. అక్టోబరు 2 నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులు కనబడడానికి వీల్లేదని కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే గట్టిగా ఆదేశించారు. అయితే హోల్‌సేలర్లపై మాత్రం దయ చూపిస్తుండడంతో కవర్ల కట్టడి కష్టంగా మారుతోంది. జిల్లాలోని 9మంది హోల్‌సేలర్ల దుకాణాల్లో ఇటీవల కాలుష్య నియంత్రణ అధికారులు సోదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను గుర్తించారు. వాటిలో కవర్లే అధికం. కానీ కేవలం హెచ్చరించి వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● అయోమయం..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పాలిథీన్ కవర్లు జిల్లాలో అక్టోబరు 2 నుంచి కనబడడానికి వీల్లేదని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో కూడా అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నారు. కానీ రాజమహేంద్రవరంలో కొద్దిగా కంట్రోల్ అయినా మిగతాచోట్ల మామూలుగానే లభ్యమవుతున్నాయి. దీంతో ప్రజలు నిషేధం ఉందా? లేదా? ఉంటే.. ఏ పరిధిలో ఉంది? అనే అయోమయంలో పడుతున్నారు. జరిమానాలు విధిస్తున్నారేగానీ జనాల్లో అవగాహన కల్పించడం కనబడడం లేదు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడానికి వాహనాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై అనౌన్స్‌మెంట్ చేయిస్తూ ఉంటే కాస్త మార్పురావచ్చు. అలాగే నార సంచులను విరివిగా అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా హోల్‌సేలర్లపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

హామీ నెరవేర్చిన సీఎం చంద్రబాబు

ముగ్గురు దివ్యాంగులకు రూ.6 వేల నుంచి పెన్షన్ రూ.15 వేలకు పెంపు



గజ్జరంలో సీఎం చంద్రబాబుకు తన దివ్యాంగ కుమారుడికి సహాయం కోరుతున్న ఓ తండ్రి (ఫైల్‌ఫొటో)

రాజమహేంద్రవరం, జూలై24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 1న కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించినప్పుడు ముగ్గురు దివ్యాంగులు పరిస్థితిని చూసి చలించారు. వారు అనారోగ్యంతో వేరే వారి సహాయం లేకపోతే మంచం మీద నుంచి కూడా లేవలేని పరిస్థితి కనిపించడంతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి ఆయన ఆదేశాలు జారీచేశారు. ఇంతవరకూ వారికి దివ్యాంగుల కోటాలో రూ.6 వేలు పింఛన్ వస్తోంది. వారికి ఆరోగ్య పింఛన్‌గా మార్పు చేసి రూ.15 వేలు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన అలజింగి అరుణ, తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన పెంట మధురిమ, కొవ్వూరు మండలం అరికిరేవులకు చెందిన మారిశెట్టి వెంకన్నలకు ఇక నెలనెల ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ కింద రూ. 15 వేల వంతున ఇవ్వనున్నారు. ఆగస్టు 1 నుంచే వీరికి ఆరోగ్య పింఛన్ పేరుతో రూ.15వేలు వంతున అందివ్వనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ పింఛన్ మంజూరు చేసే ముందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, వారి దరఖాస్తులను పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు సిఫార్స్ చేశామన్నారు. వైద్య నివేదికను పరిశీలించి, బాధితులు మానసిక వైకల్యంతో మంచానికే పరిమితమైనట్టు గుర్తించి, దివ్యాంగ పింఛన్‌ను ఆరోగ్య పింఛన్‌గా మార్చినట్టు వివరించారు. పెంచిన పింఛన్ల గురించి సెర్ప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. మలకపల్లిలో పోసిబాబు అనే చర్మకారుడి కుటుంబానికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ఆగస్టు 15వ తేదీలోపు అతని ఇంటిని పూర్తి చేస్తామని కూడా కలెక్టర్ ప్రశాంతి స్పష్టంచేశారు.

అయ్యో... ఏం కష్టమొచ్చిందో?



● ఆహార ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్ద రెండు మృతదేహాల కలకలం
● సమాచారం ఇవ్వాలని పోలీసుల విన్నపం 8

దేవరపల్లిలో మినీ స్టేడియం కలేనా..? 8

స్మార్ట్‌మీటర్లు వద్దు



శెట్టిపేటలో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిడదవోలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక వాటిపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ ఆరోపించారు. గురువారం శెట్టిపేటలో ఐఎఫ్‌టీయూ ఆధ్వ ర్యంలో స్మార్ట్‌మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వాలు ఇచ్చిన విద్యుత్ సబ్సిడీలను, తరువాత వచ్చిన ప్రభుత్వాలు నష్టాలుగా చూపుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేయటం శోచనీయమన్నారు. ఇకనైనా ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖండ వల్లి వీర వెంకటరావు, పాటంశెట్టి రాజేష్, రావి వర హాలస్వామి, దాసరి మురళి, ఎల్లే రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

కరుటూరి ధనుంజయుడికి ఎమ్మెల్యేలు పరామర్శ



సూర్యారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు

దేవరపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కరుటూరి ధనుంజయుడు తండ్రి, మాజీ సర్పంచ్ కరుటూరి సూర్యారావు ఇటీవల మృతి చెందారు. గురువారం మహారాష్ట్రకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత్ రామ్‌సేతు ఠాగూర్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సూర్యారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శిం చిన వారిలో టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, ద్వారకాతిరుమల మండల టీడీపీ అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు, బళ్లా సూర్యచక్రం, ఆచంట శేషారావు, ముళ్లపూడి దొరాజీ చౌదరి, ఉప్పులూరి రాంబాబు, కొయ్యలమూడి తాతా రావు, కంటిపూడి సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

కొవ్వూరు ఉద్యానవన పరిశోధనా స్థానం సందర్శన



ఉద్యానవన పరిశోధనా స్థానాన్ని సందర్శిస్తున్న అధికారులు

కొవ్వూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొవ్వూ రు ఉద్యాన పరిశోధనా స్థానాన్ని అఖిల భార త దుంప పంటల పరిశోధన పథకం ప్రాజెక్టు కోఆర్డినేటర్, తిరువనంతపురం భారత దుంప పంటల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా.జి.బైజు సందర్శించారు. గురువారం ఉద్యాన పరిశోధన స్థానంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కార్యక్రమంలో భాగం గా రైతులకు శిక్షణాతర గతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బైజు షెడ్యూల్డ్ కులాల రైతులతో ముఖాముఖి నిర్వ హించారు. ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డా.డి. వెంకటస్వామి, శాస్త్రవేత్తలు డా.లలిత కామే శ్వరి, డా.కె.మమత, డా.రవీంద్రకుమార్, డా. స్నేహలతారాణి, డా.శివకుమార్, కొవ్వూరు ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

కానూరు కొండాలమ్మకు సారె సమర్పణ



కొండాలమ్మ వారికి ఆషాఢం సారె తీసుకెళుతున్న గ్రామస్థులు

పెరవలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కానూ రులో వేంచేసియున్న కొండాలమ్మ వారికి ఆషాఢం సందర్భంగా గురు వారం గ్రామ ఆడపడుచులు అమ్మవారికి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ఆషాఢం సారె సమర్పించారు. ఈ సంద ర్భంగా శాకంబరి అలంకర ణగా వివిధ రకాల పండ్లు, కూరగాయలతో చక్కటి అలం కరణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహ కులు పసుపు కుంకమలు, జాకెట్‌లు, గాజులు, స్వీట్లు, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దేవరపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని రామన్నపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి ధూమంతనగూడెం, కొత్తగూడెం, సుబ్బ రాయపురం వినియోగదారులకు శుక్రవారం ఉద యం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి వినియోగదారులు సహకరించాలన్నారు.

మినీ స్టేడియం కలేనా..?

● దేవరపల్లిలో శ్లాబ్ వరకు వచ్చి ఆగిపోయిన పనులు
● కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ చిగురిస్తున్న ఆశలు
●ఎదురుచూస్తున్న క్రీడాకారులు



సగంలో నిలిచిపోయి ఉన్న నిర్మాణ పనులు

దేవరపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దేవర పల్లి జడ్పీ హైస్కూల్‌లో ఏపీ ప్రాధికార సంస్థ సహకారంతో మినీస్టేడియం నిర్మాణానికి 2017లో శంకుస్థాపన చేశారు. అలాగే దీనికి రూ. రెండు కోట్ల నిధులు కూడా కేటాయిం చారు. అయితే ఈ పనులు ప్రస్తుతం శ్లాబ్ వరకు వచ్చి ఆగిపోయాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ స్టేడియాన్ని మంజూరు చేయగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ప్రస్తుతం మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు చిగురిస్తున్నాయి. అప్పటి శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్‌ను మళ్లీ ఇప్పుడు డైరెక్టర్‌గా నియమించటంతో క్రీడాకారులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. శాప్ చైర్మన్ కే.రవి నాయుడు బోర్డు సభ్యులకు దీని గురించి తెలియజేయడం జరిగిందని, వెంటనే నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేపడతామని శాప్ డైరెక్టర్ తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముప్పిడి పర్యటన



ధారవరంలో ట్రాక్టర్‌పై నిల్చొని ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తు తం కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు కొవ్వాడ కాలువ వరద నీటితో పొంగి ప్రవహి స్తోంది. దీంతో కాలువ పరీవాహక ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరి పంట నీటమునిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువా రం ఆ ప్రాంతాల్లో పర్యటించారు. చాగల్లు, నెలటూరు, గౌరిపల్లి, మల్లవరం, చంద్రవరం, దారవరం, మార్కొండపాడులో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ ఇప్పటికే విజ్జేశ్వరం స్లూయి జ్ వద్ద నీటివిడుదల తగ్గించడం జరిగింద న్నారు. దీంతో కాలువ నీటి ప్రవాహం తగ్గి వరద నీరు వేగంగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే సొంత నిధులతో మూడు మోటార్లు ఏర్పాటు చేసి వరద నీరు కొవ్వాడ కాలువ నుంచి అప్పా రావు చానల్లోకి తోడే విధంగా ఏర్పాట్లు చేశా మన్నారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి కొవ్వాడ కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం కోసం అంచనాలు తయా రు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, టీడీపీ నేతలు బొడ్డు రాజు, బొడ్డు కేశవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం కృషి : ఎమ్మెల్యే



8వ వార్డులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజా సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయు డు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపాల్టీలోని 8వ వార్డులో గురువారం సుప రిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఏడాది కూటమిపాలనలో అమలుచేసిన అభివృ ద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపి ణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెను కబడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే అన్నిరంగాల్లో అభివృద్ధి బాట పట్టిం దన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యు లు కంటమణి రామకృష్ణారావు, దాయన రామ కృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కుప్పాల ప్రసాద్, ఐటీడీపీ ఇన్‌చార్జి గెల్లా సురేష్, బాలదారి ఉమా, రేలంగి సాయిరామ్, ఆకుల నగేష్, మారిశెట్టి సతీష్, మద్దిపాటి సత్య నారాయణ, కొప్పాక జవహర్, బర్ల శ్రీనివాస రావు, వేమగిరి వెంకట్రావు, శీని సుదర్శన్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో ప్రక్షాళనతో కూడిన పాలన'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రక్షాళనతో కూడిన పాలన జరుగుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గురువారం సగ్గొండ, గోప వరం, రామ్‌పాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనం తరం గోపవరం పంచాయతీకి ఠాగూర్ ఫ్యాక్టరీ బహూకరించిన ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభిం చారు. తర్వాత సగ్గొండ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు కవిత దంపతుల ఆధ్వర్యంలో యండపల్లి రమామణి వెంకటరత్నం మెమో రియల్ ట్రస్ట్ టాలెంట్ టెస్ట్ విజేతలకు దాతలు సమకూర్చిన నగదును అందజేశారు. ఏఎంసీ చైర్మన్ యద్ధనపూడి బ్రహ్మరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రొంగల సత్యనారాయణ, వడ్లమూడి రమేశ్, సర్పంచ్‌లు గంగారాణి, యండపల్లి శేఖర్‌బాబు, గ్రామకమిటీ అధ్యక్షుడు రమణమూర్తి, మేని వెంకట రత్నాజీ, సమ న్వయ కమిటీ సభ్యులు హోతా రాజాబాబు, వేముల నాగరాజు, గద్దే హరి బాబు, తెలుగు యువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, ఏఎంసీ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, జ్యేష్ఠశ్రీధర్, ముత్యాల రాయుడు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు వీరవల్లి శ్రీనివాస్, గ్రామ కమిటీల మండల పరిశీలకుడు రెడ్డి మునేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్రం జాషువా 54వ వర్ధంతి

కొవ్వూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కవికో కిల గుర్రం జాషువా 54వ వర్ధంతిని పట్ట ణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దళిత సంక్షేమ సంఘం నాయకులు పెను మాక జయరాజు ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ సెంటర్‌లో ఉన్న జాషువా విగ్రహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ముప్పిడి రాజు, మద్దిపట్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై అవగాహన

తాళ్లపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులంతా చదువుపై శ్రద్ధ పెట్టాలని, సెల్‌ఫోన్ల వినియోగం సంబంధిత సబ్జెక్టులకు మాత్రమే పరిమితం చేయాలని ఎస్ఐ టీ. రామకృష్ణ అన్నారు. స్థానిక కరిబండి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌తో విద్యార్థుల కు ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అన్ని ప్రమాదాలు కూడా ఉన్నాయన్నారు. అందువ ల్ల వాటిపై అప్రమత్తంగా ఉండాలని తెలి పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యా యులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి

నల్లజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధు లు, దివ్యాంగులకు ఈ నెల 26వ తేదీ నుంచి 31 వరకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు (పంచదార, బియ్యం) అందించాలని తహశీ ల్దార్ నాయుడు తెలిపారు. స్థానిక తహశీ ల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లై డీటీ సత్య నారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి, అచ్యుత భాస్కర రావు, బాయిశెట్టి లక్ష్మణరావు, దూళిపాల వెంకన్న, మహేశ్, నాగు పాల్గొన్నారు.

10 అడుగుల భారీ కొండచిలువ హతం



నల్లజర్లలో గ్రామస్థుల చేతిలో హతమైన దృశ్యం

నల్లజర్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నల్లజర్లలో భారీ కొండ చిలువ బుధవారం రాత్రి హల్‌చల్ చేసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వెనుక ఉన్న మొక్కల్లో నుంచి సుమారు 10 అడుగులు ఉండే కొండచిలువ పులి భాస్కరరావు ఇంటి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆ మార్గం లో ఇంటికి వస్తున్న భాస్కరరావు గుర్తించా డు. దీంతో స్థానికులను అప్రమత్తం చేసే సమయానికి పక్కన ఉన్న పొదల్లోకి వెళ్లిపో యింది. అయితే చివరికి ట్రాక్టర్ సాయంతో పొదలను తవ్వగా బయటకు రావడంతో గునపాలు, కర్రలతో దాన్ని హతమార్చారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

'బాలికలు మోసపోవద్దు'

కొవ్వూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పరిచయమైన ఆగంతకులను నమ్మి బాలికలు మోసపోవద్దని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం సూచించారు. కుమార దేవంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు గురువారం పోలీసులు శక్తియాప్, పోక్సో, రోడ్ సేఫ్టీ, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశా రు. ముఖ్యఅతిథిగా రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి రావు పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సి పాల్ మేరీ శౌరమ్మ, శక్తి టీమ్ ఏఎస్ఐ గంగా ధరరావు, మహిళా పోలీసు సిబ్బంది భవాని, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

శారదామాతకు 108 రకాల పిండివంటలతో సారె



సారెను సమర్పిస్తున్న మహిళలు

నిడదవోలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితిలో ఉన్న జననీ శారదామాతకు గురువారం ఆషాఢ మాసం ఆఖరి రోజును పురస్కరించుకుని 108 రకాల పిండి వంటలతో మహిళలు సారె సమర్పించారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి వేణునాగరత్నం, గీత, సుభాషిణి, ఉమ, సీతా మహాలక్ష్మి, గీతారాణి, జ్యోతి, ప్రత్తిపాటి సాగ రం, ఈవీవీ సత్యనారాయణ, వేదుల జనార్దన రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం : ఏవో



మాట్లాడుతున్న మాధవరావు

కొవ్వూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు క్షేత్రస్థాయిలో అవగా హన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్. మాధవరావు అన్నారు. కాప వరం రైతు సేవా కేంద్రాన్ని గురువారం డివిజ నల్ వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన వీఏఏలు, వీహెచ్ఏలకు మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభిం చారు. రైతుసాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమిటీ మేనేజ్డ్ నేచురల్ ఫామింగ్ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఏ విధంగా జరుగుతందో తెలి యజేశారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సాగు విధానాలను పీపీటీ రూపంలో వివరించారు. ఈవీసీ విజయకుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణను అందజేశారు. కార్యక్ర మంలో హెచ్‌వో సుధర్‌కుమార్, రినీ, ఏవో వేణు, ఎ.గంగాధర్, రుచిత, ప్రకృతి వ్యవసాయ డిపార్టుమెంటు జేపీఈ వర లక్ష్మి, ఎన్ఎఫ్ఏ కృపావతి, గౌతమ్, ఎంఎంటీఎల్ బసవనగౌడ, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు హాజరయ్యారు.

దేవరపల్లి: రైతులు సేంద్రియ పద్ధతిలో పం టలు పండిస్తే ప్రజారోగ్యం కాపాడటంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు పేర్కొన్నారు. దేవరపల్లిలో రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం నియోజకవర్గంలోని నల్లజర్ల, దేవరపల్లి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవ సాయం, ఉద్యాన వన సిబ్బందికి మూడు రోజు ల పాటు జరిగే శిక్షణ శిబిరాన్ని ప్రారంభించా రు. ప్రకృతి వ్యవసాయ, ఉద్యానవన శాఖాధి కారులు డీ.వెంకన్నబాబు, కలమరాజు, ఏ. ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నియమ నిబంధనలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్

కొవ్వూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మోటార్ రవాణా సంస్థల యజమానులు నియమ నిబం ధనలు తప్పనిసరిగా పాటించాలని ఏలూరు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురు వారం మోటారు రవాణా సంస్థల యజమా నులు, కార్మికసంఘాల ప్రతినిధులకు మోటారు రవాణా కార్మికుల చట్టం 1961, నియమాలు1 963పై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎన్.బుల్లిరాణి, సహాయ కార్మిక అధికారులు ఎం.లలితకుమారి, పి.శాంతిరాజు, పోలవరం మేఘా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కొవ్వూరు ఆంధ్రాసుగర్స్, అవంతి ఫీడ్స్, తాళ్లపూడి ఠాగూర్ లాబొరేటరీస్, పంగిడి టిపర్ లారీ ఓనర్స్ అసోసియేషన్, లారీ వర్కర్స్ అసోసియేషన్, వివిధ కళాశా లలు, పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు హాజరయ్యారు.

వెంకటరమణయ్యకి నివాళి

పెరవలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముక్కా మల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్య మ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటా నికి నివాళి అర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కడియాల సాయి రామా రావు, అయ్యంకి అవార్డు గ్రహీత ఎస్వీ సూర్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక శాఖ గ్రంథాలయం లో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంక టరమణయ్య 135వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనం తరం రిటైర్డ్ ఆంగ్ల అధ్యాప కుడు కోట రామప్రసాద్ మాట్లాడారు. గ్రంథా లయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివా స్‌స్థానికులు జి. వెంకటేశ్వరరావు. పి. రామదా రసు, సిహెచ్ శ్రీరామచంద్ర మూర్తి, టి. సుబ్బా రావు, కె. అప్పారావు, పి. శ్రీనివాస్, వి. అనిల్, కేవీ కృష్ణారావు, పి. కామరాజు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని సర్వమత ప్రార్థనలు


కొవ్వూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టు అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని కోరుతూ గురువారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు పట్టణంలోని బసివిరెడ్డిపేటలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరిశ్రమ అనుమతులపై విచారణ

గోపాలపురం, జూలై24(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య కాలుష్యం వెదజల్లే పరిశ్రమకు ఇచ్చిన అనుమతులు తొలగించాలంటూ వేలచిం తలగూడెం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాకినాడ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ శంకరరావు గురువారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఏర్పాటు చేసిన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జనావాసాల మధ్య కాలుష్యం వెదజల్లే ప్లాస్టిక్ పరిశ్రమకు గ్రామస్థుల ప్రమేయం లేకుండా ఏర్పాటు చేశారంటూ ఇటీవల ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఇదే గ్రామానికి చెందిన ఈగల అబ్బులు ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రా యాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన చేసిన అనంతరం మాట్లాడుతూ పరిశ్ర మకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. గ్రామస్థులు నరేంద్ర, షన్ముకం, అబ్బులు, సురేశ్, వెంకటేశ్వ రరావుతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యో... ఏం కష్టమొచ్చిందో?

● ఆహార ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్ద రెండు మృతదేహాల కలకలం
● సమాచారం ఇవ్వాలని పోలీసుల విన్నపం



లభ్యమైన మృతదేహాలు

ఈ ఫొటోలో కనిపిస్తున్న మృతదేహా లను వన్‌టౌన్ పోలీసులు గురువారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం గోదావరి నీటిప్రవాహం ఎక్కువగా ఉంది. మార్కండేయ ఘాట్ సమీపంలో ఉన్న ఆహార ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్ద వరద నీరు వెనక్కి మళ్లుతోంది. ఆ నీటిలో ఒక పురుష, ఒక మహిళ మృతదేహాలు తేలు తుండడాన్ని స్థానికులు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఎలాంటి ఆధారాలూ లభించలేదని సీఐ మురళీకృష్ణ తెలిపారు. సమాచారం తెలిసినవారు 9440796574 నెంబ ర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. మృతదేహాలను జీజీహె చ్ మార్చురీలో భద్రపరి చామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా మృతదేహాలను పరిశీలిస్తే ప్రాణాలు కోల్పోయి ఒకరోజు మాత్రమే అవుతున్నట్టుగా ఉంది. వయ సు సారూ ప్యతను బట్టి భార్యాభర్తలనే అనుమానం కలుగుతోంది. జీవితంలో వేదనతో వీరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా లేక వేరే కారణం ఉందో పోలీసుల దర్యాప్తుల్లో తెలియాల్సి ఉంది.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

విశిష్ట అతిథిగా రావడం ఆనందంగా ఉంది

● ప్రముఖ హాస్య నటుడు గౌతమ్‌రాజు



గౌతమ్‌రాజుకు ఆహ్వానం అందజేస్తున్న పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

కొవ్వూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా దినో త్సవాన్ని పురస్కరించుకుని పాన్ ఇండియన్ సోషియో కల్చ రల్ అసోసియేషన్ జాతీయస్థాయిలో రాజమహేంద్రవరం లో నిర్వహిస్తున్న కార్యక్రమం అభినందనీయమని ప్రముఖ హాస్య నటుడు గౌతమ్‌రాజు అన్నారు. కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న సందర్భంలో గురువారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జి సెంటర్‌లో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద తెలుగు కీర్తి పురస్కారాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విభిన్నరంగాలకు చెందిన విశిష్ట వ్యక్తులకు అందించే పురస్కారాల కార్యక్రమానికి విశిష్ట అతి థిగా రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహ కుడు అద్దంకి రాజా మాట్లాడుతూ ఆగస్టు 28వ తేదీన తెలు గుబాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఆ కార్యక్రమా నికి విశిష్ట అతిథిగా గౌతమ్‌రాజును ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత గెల్లా కేశవ, మనం ఆర్ట్ అకా డమీ వ్యవస్థాపకుడు ఇజ్జిన వినోద్‌కుమార్ పాల్గొన్నారు.